




# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 05-01-2021 VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM సంపుటి : 44 సంచిక : 100 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## గవర్నర్‌తో సీఎం వైఎస్ జగన్ భేటీ



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రాజ్‌భవన్ చేరుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను సీఎం జగన్ మర్యాద పూర్వకంగా కలిశారు. సుమారు 40 నిమిషాల పాటు ఇరువురు చర్చించారు.

గవర్నర్‌తో భేటీ అనంతరం సీఎం జగన్ నేరుగా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయానికి బయలుదేరారు.

## వీళ్లు అసలు మనుషులేనా

- ప్రతిపక్షాల తీరుపై సీఎం జగన్ ఆగ్రహం - తప్పు చేసింది ఎవరైనా వదిలిపెట్టవద్దు
- దేవుడి పేరిట విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలు
- మంచి కార్యక్రమం మొదలుపెట్టిన ప్రతిసారీ ఇలాగే
- ప్రజలు ఈ కుట్రలను నిశితంగా గమనించాలి

### పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభించిన సీఎం జగన్



చిత్తూరు: పోలీసుల పనితీరు, ఆలోచన తీరును మార్చేందుకు డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇక నుంచి ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తద్వారా సైబర్ క్రైమ్, మహిళల రక్షణ వంటి అనేక అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. టెక్నాలజీ మెరుగుపరిచేందుకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తొలిసారిగా తిరుపతిలో ఏపీ పోలీస్ డ్యూటీ మీట్‌ను సీఎం జగన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఆరేళ్లుగా పోలీస్ డ్యూటీ మీట్ జరగలేదని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా పోలీసులకు చెడ్డపేరు తెచ్చేవిధంగా కొంతమంది ఉద్దేశపూర్వకంగానే దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్న ఆయన.. ప్రతిపక్షాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తప్పు చేసింది ఎవరైనా వదలొద్దు

"గత ప్రభుత్వం తమ వాళ్లు ఏం చేసినా చూసీ చూడనట్లు వ్యవహరించాలని చెప్పింది. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనే ఇలాంటి వ్యాఖ్యలు చేసింది. కానీ మా ప్రభుత్వం అన్యాయం ఎవరు చేసినా శిక్షించాలని స్పష్టం చేసింది. ఎవరు చేసినా తప్పు తప్పే. మా వాళ్లు తప్పు చేసినా సరే.. ఎవరినీ వదలొద్దని మరోసారి చెబుతున్నా. గత 18 నెలల పాలన ప్రతిపక్షంలో ఉన్నవారికి గుబులు పుట్టిస్తోంది. కులం,మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా పథకాలు ఇస్తున్నాం. అర్హతను

తరువాయి 2లో..

## పేద విద్యార్థులకు సాంకేతిక విద్య..

### విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



నూజివీడు: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన సాంకేతిక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. కృష్ణాజిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో సోమవారం ఉదయం జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంట్రన్స్ పరీక్షల్లో 1,2,3, స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మంత్రి సురేష్, స్థానిక ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు,

తరువాయి 2లో..

## ఇళ్ల పట్టాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్



విశాఖపట్నం : పేదలందరికీ ఇల్లు పథకం లో జిల్లావ్యాప్తంగా మంజూరు చేసిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలను అనుసరించి 7వ తేదీ నాటికి నూరు శాతం పంపిణీ పూర్తి కావాలన్నారు. లబ్ధిదారులయిన ప్రతి మహిళకు ఆమెకు కేటాయించిన భూమిని చూపి, దానికి సంబంధించిన పట్టా అందించాలన్నారు. పట్టా తో పాటు ముఖ్యమంత్రి లేఖను, స్థలం సరిహద్దులను చూపించి, ఇల్లు మంజూరు పత్రాలను తప్పక అందజేయాలన్నారు. ఇళ్ల మంజూరు పత్రం అందజేసిన లబ్ధిదారు సొంత స్థలంలో తీయించుకున్న ఫోటో తప్పనిసరిగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి లబ్ధిదారులకు ఫోన్ కాల్ వచ్చే సమయానికి వారు పట్టా, స్థలం ఇంటి మంజూరు పత్రాలు అందుకుని, గృహ నిర్మాణ ఆప్షన్ ఇచ్చి ఉండాలన్నారు. జిల్లాలో ఉన్న లబ్ధిదారులందరికీ గ్రామ వాలంటీర్ల చేత పత్రాలన్నింటినీ వేగంగా సరఫరా చేయించాలన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని తాసిల్దార్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికార్లు ప్రతిరోజు సమీక్షించాలన్నారు. 8వ తేదీ నుండి థర్డ్ పార్టీ తనిఖీ ఉండవచ్చని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విశాఖ నగర పరిధిలోని లబ్ధిదారులకు కేటాయించ బోయే ఇళ్ల స్థలాలను ఏకమొత్తంగా చూపించే ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ కమిషనర్ ను ఆదేశించారు. నగరంలోని లబ్ధిదారులు అందరికీ ఇంటి పట్టా అందించి నిర్మాణపు ఆప్షన్లను తీసుకోవాలన్నారు. అలసత్వం వహించిన అధికారులను ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ జి. సృజన, నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్. మౌర్య గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్, డిఆర్డిఏ పిడి వి.విశ్వేశ్వరరావు, యు సి డి పి డి శ్రీనివాస్, ఆర్ డి వో లు పెంచల కిషోర్, సీతారామారావు, లక్ష్మీ శివ జ్యోతి, ప్రత్యేక ఉప కలెక్టర్లు సూర్య కళ, పద్మలత, అనిత గృహ నిర్మాణ శాఖ, టిడ్కో ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు

## ఏపీలో కొత్తగా 128 కరోనా కేసులు..

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. గత 24 గంటల్లో రాష్ట్రంలో 29,714 కరోనా పరీక్షలు నిర్వహించగా, 128 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఇప్పటివరకు కరోనా సోకిన వారి సంఖ్య 883210కి చేరింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. కరోనా బారినపడి గత 24 గంటల్లో చిత్తూరు, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున మరణించగా, ఇప్పటివరకు 7118 మంది మృతిచెందారు. గడచిన 24 గంటల్లో 252 మంది డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు కరోనా నుంచి కోలుకుని క్షేమంగా 8,73,149 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఏపీలో కరోనా పరీక్షలు రికార్డు స్థాయిలో నిర్వహిస్తున్నారు. నేటివరకు రాష్ట్రంలో 1,20,02,494 శాంపిల్స్‌ను పరీక్షించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 2,943 యాక్టివ్ కేసులు ఉన్నాయి.






## రామతీర్థం ఘటనపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం

### దేవాదాయ, పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి వెల్లంపల్లి భేటీ



విజయవాడ: రామతీర్థం ఘటనపై సీఐడీ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. ఘటనకు పాల్పడిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో దేవాదాయ, పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గిరిజా శంకర్, దేవాదాయ శాఖ స్పెషల్ కమిషనర్ అర్జునరావు, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్లు, ఆర్ జేసీలు, డీసీలు హాజరయ్యారు. రామతీర్థం ఘటన తో పాటు దేవాలయాలపై జరుగుతున్న దాడులపై అధికారుల నుంచి వివరాలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. రామతీర్థం రాముడు విగ్రహం పున:ప్రతిష్ఠపై చర్చించారు. అధికారులు, పండితుల అభిప్రాయాలను మంత్రి తీసుకున్నారు. నెల రోజుల్లో రాముడు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేల దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు

తరువాయి 2లో..

## సీఎం జగన్‌కు మంచి పేరు రావద్దని చేస్తున్నారు

### తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తాడేపల్లి: విగ్రహాల ధ్వంసం వరుస ఘటనల వెనక టీడీపీ వారే ఉన్నారనేది వాస్తవమని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బీజేపీ కూడా టీడీపీ ఆరోపణలను నమ్ముతున్నారని, అందుకే సీబీఐ విచారణ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. సోమవారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు మంచి పేరు రాకుండా చేయాలని ఇవన్నీ చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కూడా టీటీడీ విషయంలో అనేక ఆరోపణలు చేసిన విషయాలను ప్రస్తావించారు. శ్రీవారిని ఏసుగా మార్చామంటూ, దీపకాంతులను వేరే రకంగా చిత్రీకరించిన ఆరోపణలన్నింటినీ తప్పని నిరూపించామని స్పష్టం చేశారు. అయినా కావాలని ఆరోపణలు చేస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు సీబీఐని రాష్ట్రంలోకి రానివ్వమన్న చంద్రబాబు ఇవాళ అదే సీబీఐ విచారణ కోరుతున్నారని విమర్శించారు. అందుకే దీని వెనక ఎవరున్నారో, ఇలా చేయడం ఎవరికి అసవరమో ప్రజలు తెలియాలంటే సీబీఐ దర్యాప్తు చేయాల్సిందేనని అభిప్రాయపడ్డారు.

# అక్కా చెల్లెమ్మల ను సొంత ఇంటి యజమానులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం..

### ... రాష్ట్ర డిప్యూటీ సీఎం, రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన కృష్ణదాస్



నర్సీపట్నం : నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పాయకరావుపేట నియోజక వర్గం కోటవురట్ల మండలం పాములవాక, పీ కే పల్లి, చినబొ డ్డేపల్లి , ఆకసాహెబ్ పేట గ్రామ పంచాయతీ లకు చెందిన 211 మంది సొంత ఇళ్లు లేని అర్హులైన పేద లబ్ది దారులకు స్థల పట్టాలను రెవెన్యూ శాఖా మాత్యులు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు కావలసిన అవసరాలను అడగకుండానే తీరుస్తూ ప్రజారంజకమైన పాలన అందిస్తున్నారన్నారు. అర్హులందరికీ వైయస్సార్ జగన్ అన్న కాలనీలలో ఇళ్ల స్థలాలను ఇవ్వడంతో పాటు, ఇంటి నిర్మాణాలను చేపట్టి గ్రామగ్రామాన పండగ వాతావరణాన్ని కల్పిస్తున్నారన్నారు . ప్రతి నిరుపేద కుటుంబంలో ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని నవరత్నాలలో సొంత ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇంటికి స్థలాలను ఇస్తున్నారని, అంతే కాకుండా వాటి నిర్మాణాలను కూడా చేపట్టి మహిళ లను ఇంటి యజమానులుగా చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్య వైద్య రంగాలకు కూడా ప్రాముఖ్యత కల్పిస్తూ పలు అభివృద్ధి పథకాలను అందిస్తున్నారన్నారు. గ్రామాలలోనూ పట్టణాలలోనూ సచివాలయ, వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పారదర్శకంగా పరిపాలనను కొనసాగిస్తున్నార న్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తూ దేశంలో సమర్ధుడైన మూడో ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. రానున్న రోజులలో మొదటి స్థానంలో నిలుస్తారని ఆశిస్తున్నానన్నారు. వ్యవసాయ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా ను అందించడం ద్వారా వారికి ఆర్థిక చేయూత నిస్తున్నారన్నా రు. అమ్మఒడి, పింఛన్లు , ఆరోగ్యశ్రీ తో పాటు పలు రకాల పథకాలను అర్హులందరికీ చేరే విధంగా అమలు చేస్తున్నారన్నారు. బీసీల సంక్షేమం కోసం 56 రకాల బీసీ కార్పొరేషన్ లకు చైర్మన్లను , డైరెక్టర్లను నియమించిన ఘనత ముఖ్యమంత్రి దేని అన్నారు. కరోనా వైరస్ ను కట్టడి చేయడంలో సాహసోపేత నిర్ణయాలు తీసుకొని అనుకున్న లక్ష్యాలను సాధించి భారత ప్రధాని చేత ప్రశంసలు పొందారన్నారు. నివర్ తుపానుకు పంట నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తూ ఇన్పుట్ సబ్సిడీని వారి ఖాతాల్లో జమ చేశారన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పాములవాక గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ పనుల నిమిత్తం రెండు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు.

అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బి వి సత్యవతి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అని మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ, మహిళలందరినీ లక్షాధికారులగా చేస్తూ వారి పేరునే ఇంటి స్థలం ఇస్తున్నారని మనమందరం వారికి కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాములవాక గ్రామం లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి , సోలార్ లైట్లు ఏర్పాటుకు ఎంపీ ల్యాండ్ నిధుల నుండి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

పాయకరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు గొల్ల బాబూరావు మాట్లాడుతూ ఈరోజు ఎంతో శుభ దినం అనీ ,ఇళ్ల పట్టాల పండుగ సంక్రాంతికి ముందే వచ్చిందని, నివసించేందుకు సొంతఇల్లు అనే స్థి రాస్తి సంపాదించుకోలేమనే బాధ నుండి ఊరట లభించిందన్నారు.

నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్ మౌర్య మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల మండలం లో సుమారు 1507 మంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు. ఈరోజు జరిగిన ఈ కార్యక్రమంలో పాములవాక , పీకే పల్లి , చిన్న బొడ్డేపల్లి, అకా సాహెబ్ పేట గ్రామ పంచాయతీలలో 211 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులై ఉండి ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉంటే సంబంధిత గ్రామ , వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి 90 రోజుల లోపల అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ప్రత్యేక అధికారి విశ్వేశ్వరరావు , కోట వురట్ల తహసీల్దార్ బి రామారావు, మాజీ ఎమ్మెల్సీ డి వి సూర్య నారాయణ రాజు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.



# వీళ్లు అసలు మనుషులేనా

మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటున్నాం. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయి ప్రజలు ఆనందంగా ఉంటే ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయి. ఇంత మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం కష్టమని గుర్తించి నాయకులు కుట్రలు చేస్తున్నారు సోషల్ మీడియా ద్వారా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు" అని టీడీపీ తీరుపై సీఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వీళ్లు అసలు మనుషులేనా?**

"కొంతమందికి దేవుడు అంటే భయంలేదు, భక్తి లేదు. దేవుడిపై రాజకీయం చేస్తున్నారు. దేవుడి విగ్రహాలతో చెలగాటమాడుతున్నారు. విగ్రహాలు ధ్వంసం చేసి పచ్చ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు. వీళ్లు అసలు మనుషులేనా.. కులాలు, మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. ఇలాంటి కేసులను విచారించే పరిస్థితిలోకి మనం వచ్చాం. దేవుడి విగ్రహాలను పగులగొడితే ఎవరికీ లాభం? ఆలయాల్లో అరాచకం చేస్తే ఎవరికీ లాభం? ప్రజల విశ్వాసాలను దెబ్బతీసి తప్పుడు, విష ప్రచారం చేస్తే ఎవరికి లాభం? ఎవరిని టార్గెట్ చేసి ఇలాంటి దుర్మార్గాలు చేస్తున్నారు?" ప్రతిపక్షాల తీరును సీఎం జగన్ ఎండగట్టారు. ఇలాంటి వాటిని ప్రజలు నిశితంగా గమనించాలని విజ్ఞప్తి చేశారు.

**మంచి కార్యక్రమం మొదలుపెట్టిన ప్రతిసారీ..**

"ప్రభుత్వం నుంచి ఏదైనా మంచి కార్యక్రమం జరుగుతున్నప్పుడు.. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ పథకాల నుంచి దృష్టి మరల్చేందుకు కుట్రలు చేస్తున్నారు" అని సీఎం జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు జరుగుతున్నాయని, రాజకీయంగా జరుగుతున్న గొరిల్లా యుద్ధతంత్రాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పోలీసులకు దిశానిర్దేశం చేశారు. పోలీసులకు చెడ్డపేరు తెచ్చే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. జన సంచారం లేని చోట, టీడీపీ నేతల పర్యవేక్షణలో ఉన్న ఆలయాల్లోనే ఇలాంటి ఘటనలు జరగుతున్నాయని, 20వేల ఆలయాల్లో గతంలో ఎన్నడూలేని విధంగా సీసీ కెమెరాలు పెట్టామన్నారు. కొన్ని మీడియా సంస్థలను ప్రజలను రెచ్చగొడుతున్నాయని, పథకం ప్రకారమే కుట్రలు పన్నుతున్నారన్నారు.

-2019 నవంబర్ 14న ఒంగోలులో మనబడి నాడు నేడు ప్రారంభించాం. ఆ సమయంలో గుడిని కూల్చారని అసత్య ప్రచారం చేశారు.

- 2020 జనవరి 21న పిఠాపురంలో 23 విగ్రహాలు ధ్వంసం చేశారని ప్రచారం చేశారు.

- అదే రోజు దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ధరల స్థిరీకరణ పథకం ప్రారంభించాం. రొంపిచర్లలో వేణుగోపాల స్వామి ఆలయాన్ని ధ్వంసం చేశారని ప్రచారం చేశారు.

- ఫిబ్రవరి 14న తూర్పు గోదావరి జిల్లాలో ఆలయ రథాన్ని దగ్ధం చేశారు.

- రాజమండ్రిలో దిశ పోలీస్ స్టేషన్ ప్రారంభించారని, దానికి ప్రచారం రాకూడదని ఇలాంటి పని చేశారు. ఒక్క దిశ పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తే మూడు ఘటనలకు పాల్పడ్డారు.

- ఆసరా కార్యక్రమాన్ని ప్రారంభించే సమయంలో దుర్గ గుడి వెండి సింహాలను మాయం చేశారు.

- రైతన్నల కోసం బోర్లు వేయించే కార్యక్రమాన్ని ప్రారంభించే సమయంలో అక్టోబర్ 8న విద్యా కానుకను ప్రారంభించేందుకు సిద్ధమయ్యాం. మూడు రోజుల ముందు ఆలయాల ధ్వంసాలకు కుట్ర పన్నారు

- విజయనగరంలో సీఎం జగన్ వస్తున్నారని తెలిసి రామాలయంలో విగ్రహం ధ్వంసం చేశారు. ఇందులో చాలా ఆలయాలులో దేవాదాయ శాఖ పరిధిలోని కావు. ఇవన్నీ మారుమూల ప్రాంతాల్లో, జన సంచారం లేని ప్రాంతాల్లో జరిగిన ఘటనలు. చాలా ఆలయాలో టీడీపీ నాయకుల పర్యవేక్షణలో ఉన్నాయి.

## రామతీర్థం ఘటనపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం

చేశామని అధికారులు తెలిపారు. చిన్న చిన్న దేవాలయాల్లోనూ కూడా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు, మెటల్ డోర్ డిటెక్టర్స్ తో తనిఖీలు, ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు జరిగిన దేవాలయాలపై దాడుల వెనుక కుట్ర కోణం దాగి ఉందని మంత్రి వెల్లంపల్లి అభిప్రాయం వ్యక్తం చేశారు. రామతీర్థం ఆలయంలో జరిగిన ఘటన దురదృష్టకరమని, దీని వెనుక కుట్రకోణాలు కనిపిస్తున్నాయని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

తిరుపతి ఉప ఎన్నికలో లబ్ధి కోసమే బాబు కుట్రలు..

సమీక్ష అనంతరం మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. రామతీర్థం ఘటనపై సీఎం వైఎస్ జగన్... ఇప్పటికే సీఐడీ విచారణకి ఆదేశించారని, రామతీర్థం ఆలయాన్ని పూర్తిగా ఆధునీకరించాలని సీఎం ఆదేశించారని ఆయన తెలిపారు. "అధికారులు రూపొందించిన డిజైన్‌ని ఆమోదించాం. ఆగమ పండితులతో చర్చించాం. విగ్రహాన్ని ఎప్పుడు పునఃప్రతిష్ట చేయాలో మరోసారి అగమ పండితులతో చర్చించి రెండు రోజులలో ప్రకటిస్తాం.రామతీర్థం దోషులనను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. బీజేపీ ర్యాలీ విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. రామతీర్థం చాలా చిన్న ప్రాంతం. ఎక్కువ మంది వెళ్తే ఇబ్బందికరం. రాజకీయంగా బురద చల్లాలని చూడటం దారుణం. విజయవాడలో ఓ ఆలయంలో జరిగిన ఘటనపై విచారణ జరుగుతోంది. రాజమండ్రి ఘటనపై కూడా సీఐడీ విచారణకి ఆదేశించాం. టీడీపీ వర్గానికి చెందిన ఆలయాల్లోనే దాడులు జరుగుతున్నాయి. టీడీపీ నేతల ఆధీనంలో ఉన్న ఆలయాల్లో సీసీ కెమెరాలు పెట్టలేదు. రాష్ట్రంలో ఆలయాలపై దాడుల కేసులో 169 మందిని అరెస్ట్ చేశాం. రాష్ట్రంలో 57,584 ఆలయాలు ఉన్నట్టు పోలీస్‌శాఖ మ్యాపింగ్ చేసింది. అంతర్వేది ఘటనకు ముందు 3వేల ఆలయాల్లోనే సీసీ కెమెరాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 39,076 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. దేవాలయాల నిధులను ఎక్కడా డైవర్ట్ చేయలేదు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వందలు, వేలల్లో దాడులు జరిగాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బాబు హయాంలో ధ్వంసం చేసిన ఆలయాలను పునర్నిర్మిస్తాం. తిరుపతి ఉపఎన్నికలో లబ్ధి కోసం బాబు కుట్రలు చేస్తున్నారని" మంత్రి వెల్లంపల్లి మండిపడ్డారు.

**పేద విద్యార్థులకు సాంకేతిక విద్య..**

ఛాన్సలర్ కేసీరెడ్డి అడ్మిషన్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విలువలతో కూడిన విద్యనందించేందుకు ట్రిపుల్ ఐటీ లకు ఏడాదికి 200 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో త్వరలో స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీలను నిర్వీర్యం చేశారన్నారు. ట్రిపుల్ ఐటీలకు చెందిన రూ.188 కోట్ల నిధులను పసుపు-కుంకుమ పథకానికి మళ్లించి చంద్రబాబు రాక్షస ఆనందం పొందారన్నారు. అధ్యాపక సిబ్బంది సమస్యలపై గవర్నింగ్ కౌన్సిల్లో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని మంత్రి సురేష్ పేర్కొన్నారు.

# వీరుమామ ఆధ్వర్యంలో రోడ్లపై నివసించే వారికి కంబళ్ళు పంపిణీ



విశాఖపట్నం : డిసెంబర్ నుండి జనవరి వరకు సుమారు 200 మందికి కంబళ్ళు మరియు దుప్పట్లు ప్రతి సంవత్సరం పంచడం సుమారు పదేళ్లగా అలవాటని,...

అలాగే ఈ సంవత్సరం కూడా గాజువాక, మల్కాపురం, శ్రీహరిపురం, షీలానగర్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ ఫ్లై ఓవర్ వద్ద నివసించే వృద్దులకు కంబళ్ళు పంచిపెట్టే కార్యక్రమం నిర్వహించామని, ఈ మంచి కార్యక్రమానికి...

తమ వంతు సహాయం అందించిన సుశీల, కన్యాకుమారి , జనని , లక్ష్మి, సూర్యకళ కి ధన్యవాదాలు అని దివ్య చైర్మన్ వీరుమామ కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ఎప్పుడు చేస్తూ పేదవారికి అందరూ తోడుగా ఉండాలని దివ్య బ్రాండింగ్ మేనేజర్ నూకేష్ తెలిపారు.

### అర్హత ఉంటే ఇళ్ల స్థలం ఇస్తాం
### - తహశీల్దార్ జానకమ్మ

నాతవరం : అర్హత ఉంటే ఇళ్ల స్థలం అంద జేస్తామని నాతవరం తహశీల్దార్ జానకమ్మ అన్నారు. సోమవారం నాతవరం మండలం గన్నవరం పంచాయతీ వైబి.పట్నం, వెదు రుపల్లి పంచాయతీలో వైసిపి సీనియర్ నాయకులు అంకంరెడ్డి జమీలు చేతుల మీదుగా ంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జానకమ్మ మాట్లాడుతూ అర్హత ఉండి ఇళ్లు రాకపోయినా వారు సచివాలయంలో దరఖాస్తు చేస్తే 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పైల సునీల్, శెట్టి నూకరాజు, పిఏసిఎస్ అధ్యక్షులు గొర్లె వరహాలబాబు, ఆర్ చిన్నబ్బాయి, మండల సర్వేయర్ సత్యనారాయణ పాల్గొన్నారు.


### రేవళ్ల, మంప గ్రామాల్లో
# ఇళ్ల పట్టాలు పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యూరు : కొయ్యూరు మండలం రేవళ్ల గ్రామంలో 56 మందికి, మంప గ్రామంలో 152 మందికి సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసిపి నాయకులు బడుగు రమేష్ హాజరై మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత వైసిపిదేనన్నారు. నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ముందుకు దూసుకుపోతున్న జగనన్నకు. రాబోయే రోజుల్లో సర్పంచులు ఎంపీటీసీలు గెలిచి బహుమతిగా ఇవ్వాలన్నారు. 80 సంవత్సరాల వృద్దురాలు మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు ఎన్నో ప్రభుత్వాలు చూశానని, ఏ ఒక్క ప్రభుత్వ నుంచైనా అయినా తనకు ఇల్లు పట్టా వస్తుందని,ఆశించని, ఇది కలగా మిగిలిపోతుందని అనుకున్నానని, కానీ రాజన్న బిడ్డ జగన్ వల్ల నాకు ఇల్లు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, వీఆర్వో పాండయ్య, హౌసింగ్ అధికారులతో పాటు కొండపల్లి దేవుడు, ఇంగువ హరిమూర్తిపడాల్, గోకిరి చిన్నారావు, బల్ల ప్రసాదు, నిమ్మల వీరబాబు, అగురు రాంబాబు పాల్గొన్నారు.

# స్పందనకు 66 వినతులు




శ్రీకాకుళం : స్పందన కార్యక్రమానికి 66 వినతులు అందాయని జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని స్పందన విభాగంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పలువురు ఫోన్ చేస్తూ తమ సమస్యలను డి.ఆర్.ఓకు వివరించారు. ముందుగా జి.సిగడాం నుండి పిన్నింటి నారాయణరావు ఫోన్ చేస్తూ యస్.సి.కాలనీలో గల తమ పంటపొలాల ప్రక్కన యస్.సిలకు చెందిన పట్టాలపై బి.సిలు కొనుగోలు చేయడమే కాకుండా దానిపై గృహరుణాలను కూడా తీసుకున్నారని, తమ పంట పొలాలకు వెళ్లేందుకు త్రోవలేకుండా రేకుషెడ్డులను నిర్మించారని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. శ్రీకాకుళం పట్టణంలోని ఇలిసిపురం నుండి యస్.వేణుగోపాలరావు మాట్లాడుతూ 9వ వార్డులో నివాసం ఉంటున్న తనకు వి.ఆర్.ఓ, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ తనకు ఇల్లు రాకుండా చేస్తున్నారని, కావున బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. రాజాం మండం బొద్దాం నుండి మడ్డు సత్తెమ్మ మాట్లాడుతూ తాను వితంతునని, తాను వితంతు పింఛను కొరకు దరఖాస్తు చేసుకుంటే తన ఆధార్ కార్డు వేరేవారి పింఛనుకు జనరేట్ అయినట్లు చూపిస్తుందని, కావున దానిని సరిచేసి తనకు వితంతు పింఛను మంజూరుచేయాలని ఫిర్యాదు చేసారు. కోటబొమ్మాళి మండలం మూలపేట నుండి బమ్మిడి రామన్న మాట్లాడుతూ పి.ఎం కిసాన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంతవరకు మంజూరుకాలేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. సారవకోట నుండి దున్న నాగరాజు మాట్లాడుతూ తనకు పి.ఎం.కిసాన్ గత 7 విడతలు నుండి అందలేదని, ఎన్ని సార్లు దరఖాస్తు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసారు. నందిగాం మండలం జల్లపల్లి నుండి నక్కు ధనస్సు మాట్లాడుతూ తాను చర్మకళాకారుడునని, కావున తనకు పింఛను మంజూరుచేయాలని దరఖాస్తుచేయగా, తన కుమారునికి సదరం పెట్టారని, తన కుమారునికి ఎటువంటి వికలాంగ పింఛను రానందున తనకు చర్మ కళాకారుల పింఛను మంజూరుచేయాలని కోరారు. సోంపేట మండలం మామిడిపల్లి నుండి యస్.వంశీ మాట్లాడుతూ తనకు జగనన్న విద్యాదీవెన కొరకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంతవరకు మంజూరుకాలేదని ఫిర్యాదు చేసారు. రాజాం మండలం బొద్దాం నుండి ఎ.సౌమ్య మాట్లాడుతూ తన తల్లికి వృద్ధాప్య పింఛను మంజూరుచేయాలని కోరుతూ గత 5 మాసాల క్రితం దరఖాస్తు చేయడం జరిగిందని, కాని ఇంతవరకు మంజూరుచేయలేదని ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయపు హెచ్ సెక్షన్ నుండి జె.చలమయ్య, స్పందన విభాగం సూపర్ వైజర్ బి.వి.భాస్కరరావు, ఇతర రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరోనా నియంత్రణపై మరింత అప్రమత్తత

### - సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు

శ్రీకాకుళం : కరోనా నియంత్రణపై మరింత అప్రమత్తతతో వుండవలసిన ఆవశ్యకత వుందని సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం జె.సి.క్యాంపు కార్యాలయంలో కోవిడ్-19 నియంత్రణపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరోనా సెకెండ్ వేవ్ ప్రబలకుండా 50 రోజుల కేంపెయిన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నద న్నారు.

డిశంబరు ఒకటవ తేదీ నుండి జనవరి 19వ తేదీ వరకు 50 రోజులు కేంపెయిన్ కార్యక్రమాన్ని అధికారులు ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. సానిటైజరు వుపయోగించాలని, సామాజిక దూరం పాటించాలని, మాస్కులు తప్పని సరిగా ధరించాలని ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు తెలియ చేయాలన్నారు. పండుగ సందర్భంగా మరింత అప్రమత్తతతో వుండాలని వారికి తెలిపాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, పోలీస్, వైద్య సిబ్బంది, వాలంటీర్లతో సహా అందరూ మంచి సేవలను అందించడం వలన మన జిల్లాలో కేసులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ప్రభుత్వం కరోనా సెకెండ్ వేవ్ ప్రబలకుండా అడ్డుకోవడానికి 50 రోజుల కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. స్వయంశక్తి సంఘాలు, ఉపాధిహామీ సిబ్బంది, ఆర్.టి.సి. ఎండోమెంట్స్, ఎం.డి.ఓ.లు, సెక్రటరీలు, మున్సిపల్ కమీషనర్లు కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామ స్థాయిలోను, మండల స్థాయిలోను కాంపెయన్ నిర్వహించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించాలని తెలిపారు. సెకెండ్ వేవ్ ప్రబల కుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించి ప్రతీ ఒక్కరూ కరోనా పూర్తి నివారణకు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమీషనరు పి.నల్లనయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బి.శాంతి, జిల్లా పరిషత్ డిప్యూటీ సి.ఇ.ఓ. లక్ష్మీపతి, ప్రజా రవాణా శాఖ డిప్యూటీ సి.టి.ఎం. జి.వరలక్ష్మి, తదితర అధికారులు హాజరైనారు.

# నేడు ఛలో రామతీర్థంకి తరలిరండి

## బీజేపీ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి పిలుపు



గాజువాక : నేడు చలో రామతీర్థంకి తరలిరండి అని బీజేపీ శ్రేణులకు విశాఖ పార్లమెంట్ బీజేపీ అధ్యక్షులు రవీంద్ర మేడపాటి సోమవారం పిలుపు నిచ్చారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు మేడపాటి.రవీంద్ర మాట్లాడుతూ విజయనగరం జిల్లా,రామతీర్థం రామాలయంలో శ్రీ రాముని శిరస్సును దుండగులు ధ్వంసం చేసిన దానిపై నిరసన తెలుపుతూ రామతీర్థం కి నేడు అనగా మంగళ వారం న రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, జనసేన అధ్యక్షులు, పవన్ కల్యాణ్ పిలుపు మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కన్నా లక్ష్మీ నారాయణ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణు కుమార్,రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులు, శ్రీరాముని భక్తులు నిరసన దర్నా చేయడానికి చలో రామతీర్థంకి విశాఖ నుండి 500 కార్లలలో ర్యాలీగా పాల్గొనేందుకు రామతీర్థం వెడలుతున్నామని తెలిపారు. గాజువాక నియోజక వర్గం బీజేపీ కన్వీనర్ డాక్టర్ కరణంరెడ్డి. నరసింగరావు మాట్లాడుతూ పాతగాజువాక కూడలి నుండి బారీగా 50 కార్లలో ఉదయం 7.30ని.లకు బయలుదేరుతామని వార్డుకు కనీసం 5 కార్లు చొప్పున నాయకులు అందరూ తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్ రెడ్డి ,జిల్లా ఉపాధ్య క్షులు కృష్ణంరాజు, గోలి.శంకరరావు, నియోజకవర్గ కన్వీనర్లు రాజేశ్వరరావు, రామునాయుడు, రాంకుమార్, చక్రవర్తి, దిలీప్ రాజు,సెక్రటరీలు శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 51 వ వార్డులో బీజేపీలో పలువురి చేరికలు



**51 వ వార్డు నాయకుడు బొత్స క్రిస్టఫర్ (నాని)ను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలుకుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర**

విశాఖపట్నం : జివియంసి 51వ వార్డుకు చెందిన సంఘ సేవకుడు, విద్యాధికుడు బొత్స క్రిస్టోఫర్ (నాని)భారతీయ జనతా పార్టీలో పలు కార్యకర్తలతో చేరారు. బీజేపీ నాయకుడు కదిరి రాము సారథ్యంలో విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు పలువురు పాల్గొని ప్రసంగించారు.

## శ్రీసాయి అశ్విని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రేపు జాబ్ మేళా

భీమునిపట్నం : శ్రీసాయి అశ్విని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఐసిఐఎస్ఐ బ్యాంకు లో ఈజీ గా జాబ్ పొందడానికి డిగ్రీ,బి.టెక్ పాసయిన 25 ఏళ్ల లోపు యువతీ యువకులుకు రేపు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ పిట్టా సాయిరాం తెలిపారు. అర్హులైన వారు జనవరి 6న బ్యాంక్ కొలనీ లో ఉన్న విద్యాసాగర్ పబ్లిక్ స్కూల్ కు హాజరుకావాలనీ తెలిపారు. అంతేకాకుండా ఇతర జాబుల కోసం పదవ తరగతి, ఇంటర్, డిప్లొమా, భి.పార్మ్ అర్హత గల యువతీ, యువకులు ధరఖాస్తులు చేసుకోవాలని అన్నారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9381592833 హెచ్. ఆర్ హెడ్ విద్యాసాగర్ ను సంప్రదించాలని అన్నారు.

## విశాఖ సాహితీ స్వర్ణోత్సవాలు

విశాఖపట్నం : విశాఖ సాహితీ స్వర్ణోత్సవాలు సాంస్కృతిక రాజధాని విశాఖ నగరంలో విశాఖ సాహితీ సాహిత్యపరంగా 50 సంవత్సరాలుగా సేవలందిస్తూ ఉందని ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ నాలుగో తేదీన విశాఖ సాహితీ స్వర్ణోత్సవాల నిర్వహణకు సమాయత్తం అవుతోందని విశాఖ సాహితీ అధ్యక్షురాలు ప్రముఖ రచయిత్రి ఆచార్య కె. మలయవాసిని గారు తెలియజేశారు. 1971 వ సంవత్సరం లో ఏప్రిల్ 4వ తేదీన నాటి ప్రముఖ రచయిత శ్రీయుత అంగర వెంకట కృష్ణారావు విశాఖ సాహితీ ని స్థాపించారని తర్వాత కాలంలో ఎందరో ప్రముఖులు రచయితలు ఈ సంస్థను ఒక గొప్ప సాహిత్య వేదికగా మలచారని ఆమె అన్నారు. కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు, గండికోట బ్రహ్మాజీ రావు, మల్లాప్రగడ రామారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, భరాగో, కాశీ విశ్వనాథ్ వంటి ప్రముఖుల ప్రస్థానంలో విశాఖ సాహితీ వేదిక గా నిలిచిందని ఆమె అన్నారు, గత యాభై ఏళ్లలో సాహిత్యపరంగా ఎన్నో విశిష్టమైన కార్య క్రమాలను విశాఖ సాహితీ నిర్వహించిందని వాటిలో ప్రధానంగా సాహిత్య ఉత్సవాలు, మహిళా రచయిత్రుల సమ్మేళనం, చాసో సప్తతి, ఆరుద్ర షష్టిపూర్తి, మహిళా శతావధానం వంటి కార్య క్రమాలతో పాటు, సింహాచల వైభవం వంటి అనేక గ్రంథాల ప్రచురణ, ప్రాంతీయ జాతీయ సాహితీ సదస్సుల నిర్వహణ వంటి కార్యక్రమాలను విశాఖ సాహితీ నిర్వహించిందని ఆమె తెలిపారు. ఈ స్వర్ణోత్సవాల నిర్వహణకు సంస్థ కార్యదర్శి గండికోట విశ్వనాథం, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధి శొంఠి శారదాపూర్ణ మరియు డాక్టర్ కె.వి. మోహన్ లు సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తున్నారని ఆమె తెలిపారు.

## దాబా లో అక్రమ మద్యం పట్టివేత

పరవాడ : సబ్ స్టేషన్ సమీపం లో గల ఎస్ ఎస్ వి దాబా ల అక్రమ మద్యం సీసా లను పరవాడ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఎస్వి దాబాలో ఎమ్. కృష్ణారావు, వి.శ్రీను లు అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ రమేష్ తన సిబ్బందితో వెళ్ళి దాబా పై దాడి చేసి 780 ఎమ్ ఎల్ గల నాలుగు బీరుబాటిల్స్, నాలుగు మద్యం బాటిల్స్ పట్టుకున్నారు .దాబా నిర్వాహకుడుతో పాటు మరొనిందితుడు లను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## విశాఖలో నిర్మించిన ప్లై ఓవర్ బ్రిడ్జికి సావిత్రిభాయి పూలే వారధిగా నామకరణం చేయాలి




అక్కయ్యపాలెం : విశాఖ లోని ఆశీల్ మెట్ట వద్ద నిర్మించిన ప్లై ఓవర్ బ్రిడ్జి కి సావిత్రిబాయి పూలే వారధిగా నామకరణం చేయాలని న్యాయవాది, వెల్ఫర్ పార్టీ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ఐఎం అహమ్మద్ ముఖ్య మంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి కి లేఖ వ్రాసారు. ఆదివారం నగరంలో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జరిగిన పలు కార్యక్రమాల్లో భాగంగా అయన మాట్లాడుతూ పలు ప్రజా సంఘాలు, బీసీ సంఘాలను ఆయన మద్దతు కోరారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే వారధిగా నామకరణం చేయడం ద్వారా దేశంలో మొట్ట మొదటి స్త్రీ ఉపాధ్యాయునిం స్త్రీ సంఘం సంస్కర్త స్త్రీ విద్యా వ్యాప్తికి బీజం వేసిన సావిత్రిబాయి పూలే మరియు ఫాతిమా బీబీ ల సేవలకు గుర్తింపు బావి తరాలకు వారి ఆదర్శనికి నిరంతరం గుర్తింపు ఉంటుందని అన్నారు.1848 లో ఫాతిమా బీబీ, ఉస్మాన్ షేక్ తమ నివాసం మొట్ట మొదటి స్త్రీ విద్యాలయనికి ఇవ్వడం ద్వారా ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ రాజాన రమణి,ఎ పి ఎం టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిశాస్త్రి,తుమ్మిది చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మిడి రాం కుమార్,వివిధ ప్రజా సంఘాలు నేతలు పాల్గొన్నారు.

## 39వ వార్డు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం



విశాఖపట్నం : విశాఖ సౌత్ 39 వార్డు టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో వార్డు నూతన కమిటీ ఎంపికపై చర్చలు జరిపిన గంధ పోలి శెట్టి, నూకలు, చంద్రయ్య, రాజారావు, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిదప పరిశీలకులు గా విచ్చేసిన రఫీ , పల్లా శ్రీను ఆధ్వర్యంలో వార్డు అధ్యక్షుడు గా వాసుపల్లి దానయ్య అలియాస్ దానేష్, ప్రధాన కార్యదర్శి గా అబ్దుల్ హనీఫ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సమావేశంలో వార్డు సీనియర్ నాయకులు మోదుగణ, మైలపిల్లి శ్రీను, సాయి బలరాం, రెహంతుళ్ళ, కోటేశ్వర రావు, యస్.అప్పారావు, బలిరెడ్డి గోవిందమ్మ, ఇళ్ల శ్రీను, యాసిన్, బాబు రావు, కనక, మాసుం,

## కరోనా 'స్టెయిన్'పై అప్రమత్తత అవసరం

### మాస్కుల పంపిణీలో మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి



విశాఖపట్నం : కరోనా స్టేయిన్ విజృంభిస్తోన్న తరుణంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని వీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత మేడపాటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. సీతంధార రైతుబజారులో సోమవారం రైతులకు, ప్రజలకు మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది ఏవిధంగా అయితే సమిష్టంగా కరోనాను ఎదుర్కో న్నామో, అవిధంగా సెకండ్ స్టేజ్ లో కొత్తగా వచ్చిన స్టేయిన్ కరోనా వైరసన్ను కూడా అవగాహనతో అధిగమించాలన్నారు. తప్పకుండా మాస్కులు, భౌతికదూరం పాటించాలన్నారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, దీనిలో భాగంగానే మాస్కులు అందజేశా మన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైతుబజారు ఈవో వరహాలు, సహాయకుడు బి.అప్పలరాజు, మేడపాటి రామ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో

# ఘనంగా మార్గశిరమాసోత్సవాలు





విశాఖపట్నం : మార్గశిరమాసోత్సవములు-2020-21 నగరంలో గల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో తేది.15-12-2020న ప్రారంభమైన మార్గశిరమాసోత్సవములు సందర్భంగా శ్రీ చక్రనవవర్నార్చన, లక్ష్మీ హెూమం, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యాపారాయణ నిర్వహించుట జరిగినది. నేటికి 21వ రోజు సోమవారం అధిక సంఖ్యలో భక్తులు శ్రీ అమ్మవార్ని దర్శించుకున్నారు.

అన్నదానం:ప్రతి రోజు నిర్వహించు అన్నప్రసాద వితరణ కోవిడ్-19 నిబంధనలు కారణమున ప్యాకెట్ల ద్వారా 500 మంది భక్తులకు పంపిణి చేయుట జరిగినది. భక్తులకు ప్రత్యేక విజ్ఞప్తి. కరోణ వైరస్ (కోవిడ్- 19) కారణంగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మహెూత్సవములలో కోవిడ్ - 19 కారణంగా సామాజిక దూరం పాటిస్తూ పరిమిత సంఖ్యలో భక్తులను శ్రీ అమ్మవారి లఘు దర్శనం అనుమతించిన సందర్భంలో భక్తులకు స్లాట్ సిస్టం ఏర్పాటు చేసినప్పటికీ గ్రామీణ మరియు దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు స్లాట్ స్లిప్ పొందలేని పరిస్థితుల్లో గ్రామీణ మరియు దూర ప్రాంతం నుండి శ్రీ అమ్మవారి దర్శనం మనకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శన టికెట్ సెల్ ఏర్పాటు చేసి సదరు సెల్ ద్వారా వంద రూపాయలు ప్రత్యేక దర్శనం టికెట్లు జారీ చేయుటకు దేవస్థానం వారు ఏర్పాటు చేసి ఉన్నారు. భక్తులు ఈ సౌకర్యం ఉపయోగించుకోవలసిందిగా కోరడమైనది శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి సువర్ణ పుష్పములతో-అష్టదళ పద్మారాధన ప్రత్యేక పూజ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో తేది: 22-12-2020 మంగళవారం స్వర్ణ పుష్పార్చన (అష్టదళ పద్మారాధన) 108 స్వర్ణపుష్పాలతో ప్రత్యేక పూజ ఉదయం. 7.00 గం..ల నుండి 8.00 గం..ల వరకు నిర్వహించబడును. ఈ పూజ యొక్క రుసుము రూ. 1116/-.

**త్రికాల పంచామృతాభిషేకం:** నేటి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి త్రికాల పంచామృతాభిషేకం సేవలో 14 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజ ఆసక్తి గల భక్తులు మార్గశిర లక్ష్మీ వారంలలో రూ. 7500/-, లక్ష్మీవారం మినహా మిగతా రోజులలో రూ. 2500/- చెల్లించి పూజలో పాల్గొనవచ్చును. ఆంధ్ర బ్యాంక్, కొత్త రోడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెం060810011006691. IFSC, ANDB 0000608లో చేలించవచ్చును.

ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్ ఫర్ చేసినవారు మీ యొక్క ట్రాన్సాక్షన్ వివరములు, పూజ జరిపించవలసిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు. ఈ క్రింద వాట్సా ప్ నెంర్లు: 9550758133, 63022260299, 9291284550 మరియు మెయిల్ %ID endow-eokanaka@gov.in% ద్వారా పంపవచ్చును. గమనిక: ఆఖరి గురువారం తేది. 07-01-2021న సాయంత్రం 4.00 గంటలకు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మ వార్కి సహస్ర ఘటాభిషేకం జరుగును. కావున 3.00 గం..ల నుండి శ్రీ అమ్మవారి దర్శనములు నిలిపివేయబడును, తిరిగి భక్తులకు శ్రీ అమ్మవారి దర్శనము సాయంత్రం 7.00 గంటల నుండి అనుమతించబడును, భక్తులు గమనించమనవి.

## అక్రమంగా తరలిస్తున్న 497 కిలోల గంజాయి పట్టివేత

- డ్రైవర్ పరారీ, ఐచర్ వాహనం, గంజాయి స్వాధీనం
- చోడవరం ఎస్ఐ అట్టాడ విభూషణరావు






**- ఖాళీ ట్రైల మధ్యలో తరలిస్తున్న గంజాయి - చోడవరంలో పోలీసులకు పట్టుబడ్డ ఐచర్ వాహనం**

చోడవరం : విశాఖ ఏజెన్సీ నుండి చోడవరం మీదుగా ఐచర్ వాహనం లో అక్రమంగా తరలిస్తున్న 497 కిలోల గంజాయిని చోడవరం పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ ఐ అట్టాడ విభూషణ రావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఐచర్ వాహనంపై వెళుతున్న డ్రైవర్ పోలీసులను గుర్తించి పరారయ్యాడు. వెంటనే వాహనాన్ని తనిఖీ చేస్తుండగా వాహనం వెనుక భాగంలో కాయగూరల కు వాడే ఖాళీ ట్రై ల మధ్యలో గంజాయిని గుర్తించి వాహనాన్ని పోలీస్ స్టేషనుకు తరలించి కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న డ్రైవర్ని గాలిస్తున్నట్లు తెలిపారు.

## జివిఎంసి పన్నులు పెంపుదలకు వ్యతిరేకంగా ఈనెల 6న జరుగు ధర్నాలను జయప్రదం చేయండి

విశాఖపట్నం : కరోనా కష్టాల్లో జనం ఉన్నారు. ఆదాయాలు పడిపోయాయి. వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఉపాధి తగ్గింది. ఇటువంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోవాలి. వార్వానివాస్ ల ఆద్వార్యంలో ఈనెల6న జివిఎంసి కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని నిర్ణయించింది.

# విజయభాను సంపాదకీయం

## ఆధార్‌తో గోప్యతకు భంగమా?

వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో 'స్లాట్ బుకింగ్'తో సహా రిజిస్ట్రేషన్ల సమయంలో ఆధార్ కార్డు అడగడం సరైంది కాదని, వెంటనే దీన్ని ఆపాలని హైకోర్టు సూచించింది. ఆధార్ కార్డు సమస్య తేలే దాకా వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్‌తో సహా, పీటీఐఎన్ నెంబర్ కోసం దరఖాస్తులో కూడా ఆధార్ అడగవద్దని తెలిపింది. దీంతోవ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరోసారి నిలిచిపోయింది. ఆధార్‌పై కోర్టుల తీర్పులు కొత్తవి కావు. గత పదేండ్లుగా ఆధార్‌పై ప్రజల అభ్యంతరాల మీద హైకోర్టులతో సహా సుప్రీంకోర్టు వరకు అనేక తీర్పులు వచ్చాయి. పాలనా వ్యవహారాల్లో, ఆర్థిక వ్యవహారాల్లో ఆధార్‌ను తప్పనిసరి చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులు కొట్టివేశాయి. కానీ, ఆ తర్వాత ప్రభుత్వాలు చేసిన విజ్ఞప్తి మేరకు సంక్షేమ పథకాల అమలులో ఆధార్‌నుఅనుమతిస్తూ సుప్రీం మరో తీర్పునిచ్చింది. రకరకాల వ్యవహారాల్లో ఆధార్ వాడటాన్ని ఐచ్ఛికంగా మాత్రమే భావించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సారాంశం.

ఆధార్ అనుసంధానాన్ని కొందరు ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ఆలోచించాలి. మొదట 2004లో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వంలో ఈ ఆధార్ ప్రస్తావన వచ్చింది. (అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ వ్యతిరేకించింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నది) రెండవ సారి అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వంలో 2010 నుంచి ఆధార్ జారీచేయడం మొదలైంది. దేశ పౌరులకు రకరకాల గుర్తింపుకార్డుల వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, దేశంలో ప్రతి మనిషికి ఒక యూనిక్ ఐడెంటిటీ నెంబర్ ఉండాలని ప్రభుత్వం భావించింది. ఇందులో తప్పు లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో దేశ పౌరసత్వంతో పాటు ఇలాంటి గుర్తింపు కార్డులున్నాయి. ఈ క్రమంలోనే ఆధార్ విషయమై దేశంలో పెద్ద చర్చ జరిగింది. ఆ తర్వాత వీటి జారీ మొదలైంది. కానీ ఈ ఆధార్ వల్ల తమ గోప్యతకు భంగం కలుగుతుందని కొందరు కోర్టుకెక్కారు. కోర్టులు కూడా వారిని సమర్థిస్తూ ఆధార్ కార్డు జారీ నిలిపివేయకుండా, వాడకాన్ని నిషేధించింది. ఇది మరో సమస్యకు దారితీసింది.

దేశంలో సంక్షేమ పథకాల్లో లీకేజీలు చాలా ఉన్నాయి. చాలామంది ఒకరికి బదులు మరొకరు ఈ సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారని సుప్రీంకోర్టు ముందు ప్రభుత్వం వాదించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో అనర్హులు చాలామంది ఆహారధాన్యాలు తీసుకుంటున్నారని ప్రభు త్వం లెక్కలతో సహా నిరూపించింది. అలాగే చాలామంది అనర్హులు, బినామీలు దేశవ్యాప్తంగా రకరకాల పింఛన్లు పొం దుతున్నారని కూడా ప్రభుత్వం వెల్లడించింది. దీంతో ఇలాంటి సంక్షేమ పథకాలకు తప్పనిసరిగా ఆధార్ అనుసం ధానానికి సుప్రీంకోర్టు అనుమతించింది. కానీ ఆ తర్వాత సెల్‌ఫోన్, సిమ్‌కార్డు తీసుకోవడానికి, బ్యాంకు అకౌంట్ తెరవడానికి ఆధార్ అవసరం లేదని తీర్పునిచ్చింది.

ఆధార్ పొందడానికి వ్యక్తి నివసిస్తున్న చిరునామాకు సంబంధించిన ఏదైనా ఒక రుజువు అడుగుతున్నారు. అలాగే ఐరిస్ టెక్నాలజీని అనుసరించి వ్యక్తి కనుపాపల ఫొటోలు సేకరిస్తున్నారు. ఆ తర్వాత మామూలు ఫొటో జత చేస్తూ ఒక యూనిక్ నెంబర్‌తో ఆధార్‌కార్డులు జారీ చేస్తున్నారు. ఆధార్‌కార్డులో ఇంతకుమించి వివరాలేమీ తీసుకోవడం లేదు. రోజువారీ ప్రభుత్వంతో అవసరం ఉన్న పేదలు ఇతర అల్పాదాయ వర్గాలు ఈ ఆధార్ గురించి ప్రశ్నించలేదు. దేశంలో అందరికంటే ముందే ఈ వర్గాల వారు చేంతాడంత లైన్లో నిలబడి ఆధార్ తీసుకున్నారు. కానీ దేశం లో ఉన్న కొందరు మేధావులు, టెక్నాలజీ తెలిసినవారు, ఆస్తిపరులు, ఆ ఆస్తులను ప్రభుత్వాలకు తెలియకుండా దాచి పెట్టుకున్నవారు కొత్త ప్రశ్నలు లేవనెత్తారు. ఇది మా వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందనేది వారి వాదన.

కోర్టులు వీరి వాదన ఆధారంగా ఆధార్ ఉనికికే ముప్పు వాటిల్లే తీర్పునిచ్చాయి. ముఖ్యంగా ఆధార్‌ను ప్రభుత్వం ఎక్కడెక్కడ అడుగుతుందో పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. దేశవ్యాప్తంగా అన్ని సంక్షేమ పథకాలకు ఆధార్ వివరాలడుగుతున్నారు. దీనివల్ల ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల్లో ఒకే వ్యక్తి లేక ఒకే కుటుంబం రెండుసార్లు లబ్ధి పొందలేదు. కానీ సెల్‌ఫోన్‌లో సిమ్‌కార్డ్ తీసుకోవడానికి, అలాగే బ్యాంకు ఖాతా తెరవడానికి ఆధార్ అవసరం లేదన్నది. దేశంలో వంద కోట్ల మందికి పైగానే సెల్‌ఫోన్ వాడుతున్నారు. వీరిలో తీవ్రవాదులు, సంఘ విద్రోహులు కూడా ఉంటారు. వారి వివరాలు తీసుకోకుండా సెల్‌ఫోన్ ఎవరికి పడితే వారికి ఇవ్వడం వల్ల తీవ్రవాదంతో పాటు, వైట్‌కాలర్ నేరాలు పెరుగుతున్నాయి. నేర విచారణ సంస్థలు వారిని గుర్తించడం కష్టంగా ఉంటున్నది. కానీ కోర్టులు తీర్పు నిచ్చాయి కాబట్టి ఎవరు పడితే వారు సిమ్‌కార్డులు పొందుతున్నారు. ఇష్టమైనన్ని సిమ్‌కార్డులు తీసుకుంటున్నారు.

# నిత్యావసర సరుకులు పంపిణీ



భీమునిపట్నం : స్థానిక ఎస్ ఓ ఎస్ విలేజ్ కుటుంబ బలో పిత కార్యక్రమం ద్వారా పద్మనాభం మండలం అన్నం పేట, కోరాడ గ్రామంలో వితంతువు లకు వృద్ధుల కు పేద మహిళా లబ్ధి దారులకు వారియొక్క కుటుం బానికి నిత్యావసర సరుకులను సంస్థ ద్వారా పిల్లలో పౌష్ట కాహారం ను ఆరోగ్యాన్ని మెరుగు పరుచు కోవాటానీ కి ఎనబై వేలు విలువ గల నిత్యవసర సరుకులను అందజేశారు.

ఈ కార్య క్రమంలో ప్రోగ్రాం మేనేజర్ కె.దుర్గ రాజు, యాని మెటర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే ధర్మశ్రీ చేతుల మీదగా

## పాడి రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీ ప్రారంభం



పాడి రైతులకు సంక్రాంతి బోనస్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, విశాఖ డైరీ డైరెక్టర్ దాడి గంగరాజు

చోడవరం : విశాఖ డైరీ ద్వారా పాల సంఘాల పాడి రైతులకు ఈ ఏడాది సంక్రాంతి కానుకగా అందించే బోనస్ ను చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, విశాఖ డైరీ డైరెక్టర్ దాడి గంగరాజు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. పట్టణం లోని వైసిపి కార్యా లయం ఆవరణలో నిర్వహిం చిన ఈ కార్య క్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు పల్లా నరసింహా రావు, వైసిపి సీనియర్ నాయకులు శరగడం సిమ్మి నాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడువాక సత్యారావు, వివిధ గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నాడు నేడు పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపిడిఒ డేవిడ్‌రాజు

గొలుగొండ : గొలుగొండ పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులపై మండల విద్యాశాఖాధికారి టి.అమృత కుమార్, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, హెచ్‌ఎంలు, సచివాలయ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఆరు కోట్ల నలభై లక్షలు తో పాఠశాలలో నాడు నేడు పనులు చేపట్టడం జరిగిందని, ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తి చేశామన్నారు. ఈ నెల 15తేదీ నాటికి మిగిలిన 20 శాతం పనులు కూడా పూర్తి చేయాలని పాఠశాల హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. లేబర్ కొరత వల్ల ప్రతి స్కూల్లో కూడా పెయింటింగ్ వర్క్ మాత్రమే నిలిచి పోవడం జరిగిందని తెలిపారు.

### కులధ్రువీకరణ మంజూరులో

# నిర్లక్ష్యం చేయడం తగదు



నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

కొయ్యూరు : కొయ్యూరు మండలంలో గల రెవెన్యూ కార్యాలయంలో కులధృవీకరణ పత్రాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని బిజెపి మండల అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు అన్నారు. సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొయ్యూరు మండల పరిధిలో గల వివిధ పంచాయతీలో చెందిన విద్యార్థులు, ప్రజలు కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయడం లేదన్నారు. ప్రస్తుత తహశీల్దార్‌కి చెక్ పవర్ లేకపోవడం వలన సర్టిఫికేట్ల మంజూరులో నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. నెలలు గడుస్తున్నా సర్టిఫికేట్లు సరైన సమయంలో అందటం లేదన్నారు. తక్షణమే కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జెడ్పీటీసీ అభ్యర్థి నూకరాజు, నాయకులు గాలి దేముడు, రీమల చంద్రరావు, మచ్చల మంగతల్లి, రాజేష్‌దొర, ఎన్.సత్యనారాయణ, ప్రసాద్, వీరబాబు, కొర్రు నూకరాజు పాల్గొన్నారు.

# పాఠశాలకు బీరువా బహుకరణ



బీరువా బహుకరిస్తున్న దృశ్యం

మాకవరపాలెం : హైదరాబాదులోని రక్షణ పరిశోధన అభి వృద్ధి సంస్థలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న కుమారి బి.పద్మ కొత్త పాలెం లోని ప్రాథమిక పాఠశాలకు సోమవారం సుమారు రూ.10వేల విలువ చేసే ఐరన్ బీరువాను బహు కరించారు. విద్యార్థిని విద్యార్థులు అందరూ చక్కగా చదువుకోవాలని బాగా చదివే విద్యార్థులు అందరికీ నేను అతి త్వరలోనే బహుమతులు అందిస్తామని అన్నారు. ఉన్నత స్థానంలో ఉన్న ఉద్యోగులు అందరూ గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలో చదివిన వారేనన్నారు. మీరు కూడా చక్కగా చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉంటారని అన్నారు. ఈ సదర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోసూరు రాము, పౌర్ణమి, టీచర్, విద్యార్థులు, పద్మకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కోమాలమ్మ పాదాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి


కొయ్యూరు : పాడేరు ఘాట్‌లో కోమాలమ్మ పనుకు వద్ద కోమాలమ్మ పాదాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కొయ్యూరు మండల బిజెపి అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం కొయ్యూరు శివాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు దేవాలయాలపై ఇటువంటి విధ్వంసకర దాడులు జరుగుతున్నాయన్నారు. కోమాలమ్మ పాదాలను ధ్వంసం చేసిన దుండుగలను వెంటనే పోలీసులు గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూడ నూకరాజు, కొర్రు నూకరాజు, మచ్చల మంగతల్లి, లోకుల కిశోర్, గాలి దేముడు, వీరబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ధ్యేయంగా వైసీపీ పాలన

### - ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి : అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హాయంలో పాలన సాగుతోందని ప్రభుత్వ విప్ బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని తారువ, మారేపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో సోమవారం పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. రాష్టంలోని ప్రజలందరికీ సొంత ఇంటి కల నెరవేర్చిన వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలన పై ప్రతిపక్ష నాయకులు దుమ్మెత్తి పోయడం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను తు.చ.తప్పకుండా అమలు చేస్తున్న యువ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును అభినందించాల్సిందే అన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలను అందజేశారు. తారువ గ్రామంలో 14 మందికి, మారేపల్లి గ్రామం లో 16 మందికి, మామిడిపల్లి గ్రామం లో ముగ్గురు కు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్‌ఆర్ సీపీ అధ్యక్షులు కర్రి సత్యం, మండల యువజన విభాగం అధ్యక్షులు బూరె బాబురావు, ఆవు గడ్డ రామ్మూర్తినాయుడు, కోడి పిల్ల నాయుడు,తహసీల్దార్ జె. రమేష్ బాబు, వీఆర్వో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# రసరమ్యం...రాఘవేంద్ర చరితం

శ్రీరాఘవేంద్రులు జ్ఞాన సంపన్నుడు, సిద్ధ పురుషుడు. పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవం. మంత్రాలయంలోని బృందావన సన్నిధానంలో భక్తులు పొందే శాంతి సంతృప్తుల మాటల కందనివి. అలజడి, అశాంతి, ఆందోళనలతో నిండిన నేటి కుహనా నాగరిక సమాజానికి అటువంటి సత్పురుషుల సాహిత్యం, సాన్నిహిత్యం, సాన్నిధ్యం ఎంతో అవసరం. అది నిరంతరం వెలిగే అఖండ జ్యోతి. ఈ చిన్న శ్లోకం శ్రీ రాఘవేంద్రుల వ్యక్తిత్వాన్ని దైవత్వాన్ని శక్తిమత్వాన్ని సూచిస్తుంది.

**ఆరాధ్యదైవం**

మధ్వ సాంప్రదాయంలో ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయికి చెందిన యతివరేణ్యుడు శ్రీ రాఘవేంద్రస్వామి. నిత్య సత్య చైతన్యమూర్తి. భౌతికంగా కనిపించకపోయనా తన దివ్య మహిమలతో, లీలలతో ఆశ్రీత భక్తకోటికి దయామయుడుగా ఆపద్బాంధవుడుగా, రక్షకుడుగా ఆరాధ్య దైవమైనాడు. శ్రీ రాఘవేంద్రస్వామి పీఠాధిపత్యం వహించిన తర్వాత అంతవరకు సమతీంద్ర మఠంగా ఉన్నది రాయ మఠంగా మార్పుచెందింది. గత జన్మలలో దేవతాగణంలో శంకువరుణుడనీ, తదుపరి భక్తప్రహ్లాదుడనీ, ఇటీవలి కాలంలో వ్యాసరాయలనీ శ్రీ రాఘవేంద్రుని గురించి మధ్వ సంప్రదాయం విశ్వాస పూర్వకంగా భావిస్తుంది. దానిని కర్నాటక హరిదాస సంప్రదాయం కూడా సమర్ధిస్తుంది.మధ్వ గురుపరంలో శ్రీరాఘవేంద్రులది విశిష్టస్థానం. జీవసమాధి చెంది మూడువందల ఏళ్లు దాటినప్పటికీ ఆయన శక్తి ప్రభావం నిత్య నూతనంగా వర్ధిల్లుతున్నదనడానికి నిరంతరాయంగా భక్తి ప్రపత్తులతో బృందావన దర్శనానికి వస్తున్న అపార జన సందోహామే సాక్ష్యం.పేదరికంతో మగ్గిన స్వామి శ్రీ రాఘవేంద్రస్వామి 1571లో కాంచీపురం సమీపం లోని భువనగిరిలో నిరుపేద కుటుంబంలో పవిత్రవర్తనులైన తిమ్మన్నభట్టు, గోపికాంబ దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులుపెట్టిన పేరు వెంకట నాథుడు. వీరి తాతగారు శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన వైణికుడిగా వుండేవారు. వెంకటనాథుడి బాల్యంలోనే తల్లిదండ్రులు గతించారు. బావగారైన లక్ష్మీనారాయణ చేరదీశాడు. బావగారి పెంపకంలోనే వెంకటనాథుడు సర్వశాస్త్ర పారంగతుడయ్యాడు. యుక్తవయసు రాగానే సరస్వతి అనే కన్యతో వివాహమైంది. ఓ పిల్లవాడు కూడా పుట్టాడు. కాని వెంకటనాథునికి దరిద్రం దావాలనంలా చుట్టుముట్టింది. ఆదుకునేవారెవరు లేరు. నిస్సహాయ స్థితిలో వెంకటనాథుడు భార్యాబిడ్డలతో కలిసి కుంభకోణం చేరుకున్నాడు. అనూహ్యంగా అక్కడ తాత్కాలికంగా బసచేసిన సుధీంద్ర తీర్థులవారి ఆశ్రయం లభించింది.

సుధీంద్రుడు కొత్త శిష్యుడైన వెంకట నాథుని ఎంతో ప్రేమగా ఆదరించాడు. శిష్యుని అసమాన్య ప్రజ్ఞాపాటవాలకు ఆశ్చర్యపోయాడు. అతని మేథాశక్తిని, శాస్త్ర జ్ఞాన ప్రావీణ్యాన్ని అభినందిం చకుండా ఉండలేకపోయాడు. జ్ఞాన వరిష్టుడైన వెంకటనాథుని వినయ విధేయతలు చిత్తశుద్ధీ గురువైన సుధీంద్ర యతీంద్రులను బాగా ఆకర్షించాయి.వయోభారంతో వున్న సుధీంద్రులు శిష్యుడైన వెంకటనాథుని ఒకరోజు చేరపిలిచి వెంకట నాథా! నేను వృద్ధాప్యంలో ఉన్నాను. ఈ శరీరం నేడోరేపో అన్నట్టుగా ఉంది. రామచంద్రమూర్తి ఆరాధన నిరంతరాయంగా కొనాగించేందుకు నా తర్వాత ఈ పీఠాధిపత్యం నీవు వహించాలి అని తన మనసులోని కోరికను బయటపెట్టాడు. తకు భార్యాబిడ్డలున్నారని కుటుంబ పోషణ చేసి వారిని సుఖపెట్టడం తన బాధ్యత అని తన అశక్తతను వెల్లడించాడు వెంకటనాథుడు. గురువుగారి కోరికను తీర్చలేకపోతున్నందుకు వ్యాకులపడుతూ ఇంటికి చేరు కున్నాడు. భార్యకేమీ చెప్పలేదు.

### సంకీర్తన

# చిన్న ఇల్లు...జాతీయస్థాయి గుర్తింపు



గాజువాక: ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకంలో 60 గజాలలో అన్ని వసతులతో చూడ చక్కని ఇల్లు నిర్మించి గాజువాక ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన సాతర బోయిన దుర్గా, అప్పన్న బాబులను గాజువాక బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ దేశంలో ఏ ఒక్కరూ సొంతిల్లు లేక బాధపడకూడదని దేశంలో ప్రతి ఒక్కరికి సొంతిల్లు కలిపించాలనే లక్ష్యంతో నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం ద్వారా పేదవారికి సొంతింటి కలను సార్ధకం చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా గాజువాక నియోజకవర్గం పెదగంట్యాడ మండలం ఉప్పర కాలనీకి చెందిన దుర్గా, అప్పన్నబాబులు చాలా నిరుపేదలు వారికి ఒక సొంతిల్లు నిర్మించుకోవాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం ద్వారా కొద్దిపాటి స్థలంలో పథకం ద్వారా 2 లక్షల 50 వేల రూపాయలతో పాటు వారు కొంత డబ్బుతో కలిపి అతి తక్కువ ఖర్చుతో అన్ని హంగులతో చూడచక్కని ఇల్లు నిర్మించి, మన ప్రాంతాన్ని, మన రాష్ట్రాన్నే కాకా జాతీయ స్థాయిలోనే ప్రశంసలు పొందడం అందులోనూ దేశ ప్రధాని నరేంద్రమోడీ చేత ప్రశంసలు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంతటి చక్కని ఇంటిని తక్కువ ఖర్చుతో నిర్మించి ఎంతో మందికి అదర్శంగా నిలిచిన ఈ దుర్గా, అప్పన్నబాబులను సత్కరించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సిరసపల్లి.నూకరాజు, 69వ వార్డు మహిళా మోర్చా అధ్యక్షురాలు అడ్వకేట్ వెంకటరమనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సదరం స్లాట్లు నమోదుకు ప్రచారం కల్పించండి

**- సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గొందు సీతారాం**



విశాఖపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా,ఇటు జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం జనవరి ఫిబ్రవరి నెలలకు గాను దివ్యాంగులైన బాలలు, పెద్దలకు జారీచేసే వైకల్య ధృవీకరణ పత్రాలను జారీ కోసం స్లాట్లు జారీ చేస్తున్నట్లు సంభందిత సమాచారాన్ని దివ్యాంగులు సంక్షేమ శాఖ,వైద్య విధాన పరిషత్ అధికారులు,సమాచార శాఖ అధికారులు సంయుక్తంగా పత్రికలు,వివిధ టి.వి.ఛానెళ్లు,ఎఫ్.ఎం రేడియోలు, ప్రచార సాధనాలు ద్వారా ప్రచారం ఉధృతంగా చేయాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గొందు సీతారాం ప్రభుత్వాన్ని కోరారు,దీనిలో భాగంగా సోమవారం పెదవాల్తేరు లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో ఏ.డి..జి.వి.ఆర్.శర్మను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వినతిని పరిశీలించిన శర్మ మాట్లాడుతూ సీఆర్పీఎఫ్ వాదనను జిల్లా కలెక్టర్ దృష్టికి,వైద్య విధాన పరిషత్,సమాచార శాఖ, ఐ.టి.డి.ఎ.అధికారుల దృష్టికి తీసుకెళతానని అన్నారు. అనంతరం సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గొందు సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగాను ఇటు విశాఖ జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం జనవరి,ఫిబ్రవరి నెలలకు గాను దివ్యాంగ బాలలకు,పెద్దలకు వైకల్య ధృవీకరణ పత్రాల జారీకి ఇటీవల ఉత్తర్వులు వెలువడడం హర్షణీయమని అన్నారు,ఈ స్లాట్ ల నమోదు పై ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా పూర్తి సమాచారం లేక అత్యధిక శాతం మంది దివ్యాంగుల పిల్లల తల్లి దండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమాచార,సాంకేతిక వ్యవస్థ దగ్గరైన మన రాష్ట్రంలోనూ,విశాఖ జిల్లాలోని ఏ, ఏ.సెంటర్లు,కేంద్రాల్లో ఎప్పుడు, ఎక్కడ నమోదు చేస్తున్నారో వార్డు,గ్రామ వాలెంటీర్లు, సచివాలయం సిబ్బందితో గడప, గడపకీ సమాచారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎ.డి.ని కలసిన వారిలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కార్యదర్శి పి.శేఖర్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆఫీస్ సూపరింటెండెంట్ జి.జగదీష్ తదితరులు ఉన్నారు.

# పాడి రైతులకు సంక్రాంతి కానుక

### - విశాఖ డైరీ ద్వారా 42.4 కోట్ల బోనస్ పంపిణీ
### - 2 లక్షల, 15 పైగా పాడి రైతులకు లబ్ది
### - విశాఖ డైరీ డైరెక్టర్ దాడి గంగరాజు



విలేకరులతో మాట్లాడుతున్న విశాఖ డైరీ డైరెక్టర్ దాడి గంగరాజు

చోడవరం : ఉత్తరాంధ్ర విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం మూడు జిల్లాల్లో వివిధ గ్రామాల నుంచి పాల సంఘాల ద్వారా పాలు పోస్తున్న 2 లక్షల, 15, 143 మంది పాడి రైతులకు విశాఖ డైరీ ద్వారా సంక్రాంతి బోనస్ గా 42 కోట్ల, 04 లక్షల, 68 వేల, 799 రూపాయలను అందించినట్లు విశాఖ డైరీ డైరెక్టర్ దాడి గంగరాజు సోమవారం తెలిపారు. మండలంలోని అంబేరుపురం గ్రామం పాలు సంఘం లో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విశాఖ డైరీ ద్వారా ప్రతి ఏడాది సంక్రాంతి బోనస్ ను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పాడి రైతులకు సరఫరా చేసిన పాలు బట్టి బోనస్ లెక్కగట్టి రైతుల ఖాతాల్లోకి నేరుగా ఇవ్వడం జరిగిందన్నారు. చోడవరం యూనిట్ పరిధిలో 21, 303 మంది పాడి రైతులకు 4, 53, 98, 496 రూపాయలు, చోడవరం మండలంలో 6500 మంది పాడి రైతులకు 1, 86, 08, 416 రూపాయలను బోనస్సు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే విశాఖ డైరీ ద్వారా పాడి రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

పాడి రైతు బీమా, పశువుల బీమా, పాడి రైతులకు వైద్యం, పశువుల షెడ్లు, అవసరమైన చోట బోర్ వెల్స్ ఏర్పాటు తదితర కార్యక్రమాలను చేపడుతున్నా మన్నారు. విశాఖ డైరీ అందించే సంక్షేమ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోకగజపతిరాజుపై వెల్లంపల్లి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు



భీమునిపట్నం : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోకగజపతిరాజుపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు ఖండించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ఉదార స్వభావులు, మచ్చలేని రాజకీయానికి నిలువుటద్దం, ఎటువంటి చిన్న అవినీతి మరకలేని రాజకీయానికి మకుటంలేని మహారాజు పూసపాటి అశోకగజపతి రాజు అని అన్నారు. వేలాది ఎకరాలు భూమిని విద్యాలయాలకు, ఆశ్రమాలకు, ఆసుపత్రులకు, పేద ప్రజలకు దారాదత్తం చేసిన చరిత్ర ఆయనదనీ ఎవరికోసమైనా మాట్లాడేముందు వారిగురించి తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న మీరు నోరు అదుపులో పెట్టు కొని మాట్లాడాలని అన్నారు. వారి ఆస్తులన్నింటిని ప్రజలకే ధారాదత్తం చేసిన వ్యక్తుల కోసం మాట్లాడేముందు నీగురించి నీ స్థాయి ఏంటో తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ 19 నెలల కాలంలో 120కి పైగా హిందూ దేవాలయాలపై వివిధ రకాలుగా దాడులు జరిగాయని, మరి రామతీర్థాలో రాముని విగ్రహం శిరస్సు నరికిన ఘటనలో ఆదేవాలయం ట్రస్టీ చైర్మన్ పూసపాటి అశోకగజపతి రాజుని బాధ్యులు చేస్తూ తొలగించారని,. మరి రాష్ట్రంలో ఈ 19 నెలల కాలంలో 120కి పైగా దేవాలయాలపై దాడులు జరిగితే మీరేమి చేస్తున్నారని, మీకు ఎటువంటి సంబంధం లేదా అని ప్రశ్నించారు. అంతర్వేదిలో రథం దగ్ధం సంఘటన, విజయవాడలో రథము యొక్క వెండి సింహం దొంగిలించిన విషయం, రామతీర్థాలో రాముని విగ్రహం శిరస్సు నరికిన విషయం గాని దేని గురించి కూడా మీకు తెలియదా, అలా అయితే రామతీర్థాలకు నారా చంద్రబాబునాయుడు వస్తున్నారనగానే మొత్తము కార్యక్రమాలన్నింటిని రద్దు చేసుకొని హుటాహుటిన అదేరోజు రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ఎందుకు రామతీర్థాలు వెళ్లారనీ ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు మీకంటే ముందుగా వెళితే ఎక్కడ మీ డొల్లతనం బయటపడుతుందనే అంత రాద్ధాంతం చేశారని అన్నారు. ప్రజలు ప్రతీ విషయం గమనిస్తున్నారని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని గంటా నూకరాజు అన్నారు.

## ఆంధ్రవిశ్వవిద్యాలయం బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస రావు ఆవిష్కరించారు. సోమవారం ఉద యం ఏయూ సైన్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నూతన సంవత్సర కార్యలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యు లను అభినందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అద్యక్షులు సి.హెచ్ హరగోపాల్, అద్యక్షులు సి.హెచ్ సాంబశివ రావు, కార్యదర్శి కె.వి.ఎన్ క్రిష్ణ, కోశాధికారి ఎం. ప్రసాద్, శర్మ తదితరుల పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.శ్రీనివాసరావు

## సాయి పూజా ఫౌండేషన్ కార్యాలయం లో షిరిడీ సాయిబాబా వారికి అఖండ హారతి, అఖండ భజన

విశాఖపట్నం : సాయి పూజా ఫౌండేషన్ కార్యాలయం లో లోక కళ్యాణం కొరకు శ్రీ శిరిడీ సాయి బాబా వారికి అఖండ హారతి, అఖండ భజన చేస్తున్న సాయి పూజా ఫౌండేషన్ చైర్మన్ వానపల్లి రవికుమార్, సారిపల్లి మహేష్, మూర్తి, రమేష్, బయా శ్రీని వాస్, వెంకటాద్రి, క్రిష్ణా, శ్రీనివాస్, శివోహం ట్రస్ట్ మురళీ, పుష్పకమల భక్త బృందం పాల్గొన్నారు. సాయి బాబా ఆశీర్వాదం వల్ల అందరూ బాగుండాలి.



## విజయభాను 2021 క్యాలెండరు ను ఆవిష్కరించిన తహశీల్దార్ వెంకట వరప్రసాద్



అనంతగిరి : మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయంలో, అనంతగిరి తహసీల్దారు వెంకట వరప్రసాద్. విజయభాను క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా ఉండాలని ఆయన అన్నారు. విజయభాను దినపత్రిక రానున్న రోజుల్లో పాఠకులకు ఆకర్షించే విధంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కొత్త సంవత్సరములో మండల వాసులందరూ సుఖసంతోషాలతో ఉండా లని ఆయన కోరారు.

## భాగ్యలక్ష్మి కి సావిత్రి బాయ్ పూలే 'ఉపాధ్యాయ రత్న అవార్డు'



ములగాడ: సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇ.పి.యస్. భాగ్యలక్ష్మి ని విశాఖపట్నం లోని సావిత్రి బాయ్ పూలే మెమోరియల్ ఆర్గనైజేషన్ వారు ఉపాధ్యాయ రత్న - 2020 అవార్డుతో ఆదివారం సావిత్రి భాయ్ పూలే జయంతి సందర్భంగా ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భాగ్యలక్ష్మి గత 21 సంIIరాలు గా బోధనా రంగంలో, సామాజిక సేవలో విశేష కృషి చేసి మహిళల అభ్యు దయనికి , స్త్రీల విద్యకు పాటు పడ్డారని, అందువల్ల సావిత్రి బాయి పూలే జన్మదినోత్సవ సందరంగా ఆమెను సత్కరించడం సముచితమని తాము భావించిమని అన్నారు. సన్మాన గ్రహీత భాగ్యలక్ష్మి మాట్లాడు తనకు- సావిత్ర భాయ్ పూలే భారత దేశపు మొదటి మహిళ ఉపా ధ్యాయరాలని, సంఘ సంస్కర్త అని, ఆమె పేరు మీద అవార్డు అందుకోవడం సంతోష దాయకమన్నారు. సావిత్రి బాయి పూలే అడుగు జాడల్లో నడుస్తానని, ఆమె తనలాంటి వందలాది మహిళ అధ్యాపకులకు స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మిని పలువురు అధ్యాపకులు,సామాజిక కార్యకర్తలు అభినందించారు.

## ప్రభుత్వ పథకాలు అమలులో

# మన్యం ముందంజలో ఉండాలి

**ఐటీడీఏ పీవో డాక్టర్ వెంకటేశ్వర్**



పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు అమలు లో మన్యం ముందంజలో నిలవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. వైయస్సార్ బీమా ఆన్లైన్ నమోదు ప్రక్రియను ఈనెల 9వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం నుండి పదకొండు మండలాల తహసీల్దార్లు లతో అటవీ హక్కు పత్రాలు సిద్ధం చేయడం భూమిలేని పేదలు గుర్తింపు ,ఎంపిడిఓ లు, వెలుగు అధికారులతో వైయస్సార్ బీమా ఆన్లైన్ నమోదు వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తో వైఎస్సార్ రైతు భరోసా పై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక పింఛన్లు పంపిణీ పై సంతృప్తి వ్యక్తం చేసి అధికారులను అభినందిం చారు. బ్యాంకు అధికారులు ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేసి భీమా జగనన్న తోడు పనులు పూర్తి చేయాలని సూచించారు. గిరి ప్రగతి సర్వే పై ఆరా తీశారు. ఆధార్ తప్పులను సరిచేసి రైతులకు రైతు భరోసా అందించా లన్నారు. మధ్యాహ్నం నాడు నేడు పనులపై ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాడు నేడు పనులు నిర్దిష్ట సమ యంలో లోకి ముగించలేదని ముంచింగిపుట్టు గిరిజన సంక్షేమ శాఖ ఏఈ కి ముంచింగిపుట్టు , అనంతగిరి, ఎం ఈ ఓ లకు ,గేమెలి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మనబడి నాడు-నేడు లో పనులు చేసిన పాఠశాలలకు వినూత్నంగా చక్కని రంగులు వేయించాలని అవకాశం ఉన్న చోట పాఠశాలల బోర్డులను ఏ ఈ డి బోర్డులతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 10వ తేదీ నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలకు మంజూరైన నిధులతోనే పనులు పూర్తి చేయాలని అన్నారు. అదనపు బడ్జెట్ ల కోసం జాప్యం చేయకూడదని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఈ ఈ, కె.వి ఎస్.ఎన్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జీ. విజయ్ కుమార్, సహాయ గిరిజన సంక్షేమ శాఖ ఎల్. రజిని తదితరులు పాల్గొన్నారు.

## నాగవంశం కార్పొరేషన్

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



విజయవాడ : అన్ని కార్పొరేషన్లకు పేద్దపీట వేస్తూ, 70 ఏళ్ల నాగవంశీయుల స్వప్నాన్ని సకారం చేసిన మహానీయుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు అని నాగవంశీయుల కార్పొరేషన్ ఛైర్ పర్సన్ బొడ్డు అప్పల కొండమ్మ, అప్పల నాయుడు పేర్కొన్నారు. నాగవంశీయులు రూపొందించిన 2021 నూతన క్యాలెండర్ ను సోమవారం ఉత్తరాంధ్ర ఇన్ ఛార్జి విజయసాయి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు చేసే విషయంలో వైసీపీ ప్రభుత్వం రాజీ లేకుండా సేవలందిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో మీరందరూ పనిచేయాలన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్ని విధాల నాగవంశీయుల కార్పొరేషన్ అండగా నిలవాలని ఆయన సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన నాటి నుంచి నాగవంశీయుల నేతృత్వంలో గత 11 ఏళ్లుగా నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్నామన్నారు.

# ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

పరవాడ : మండలం లోని పరవాడ భవిత కేంద్రము లో సోమవారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. దివ్యాంగులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్ ఈ ఓ సునీత హాజరైనారు. ముందుగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం ప్రాముఖ్యతను, సమగ్ర శిక్షా అభియాన్ అందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం విశాఖ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లయిండ్ యూనియన్ సెక్రెటరీ కె. సూరిబాబు ను స్థానిక ఎమ్ ఈఓ సునీత చేతుల మీదగా ఘనంగా సత్కరించారు. విశాఖ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లయిండ్ యూనియన్ ప్రెసిడెంట్ ఎస్.అర్జున్‌రావు, కమిటీ సభ్యులు గురునాయుడు, ముత్యాల రావు, సత్యవతి లు వారి జీవితంలో జరిగిన సంఘటనలను దివ్యాంగుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్ పరవాడ ప్రదాన ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, భవిత టీచర్స్ టి.కుమారి, జి.శ్రీనివాసరావు మరియు దివ్యాంగులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# చిన్నారులకు ఆటతో కూడిన విద్య



అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఉదయం ప్రదర్శించారు. ప్రదర్శన కార్యక్రమంలో పాల్గున్న సెక్టార్ -2 సూపర్ వైజర్ మానస మాట్లడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించడంతో పాటుగా ఆటతో కూడిన విద్యను అందించేందుకు అంగన్వాడీ కార్యకర్తలు ఫ్రీ స్కూల్ మెటీ రియల్ తయారు చేయడం

కంచరపాలెం : అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు ఆట తో కూడిన విద్య అందించే విదంగా ఫ్రీ స్కూల్ మెటీరియల్ ను అంగన్వాడీ కార్యకర్తలు తయారు చెయ్యటం జరిగిందని ఐ.సి.డి.ఎస్ అర్బన్ -1 , సెక్టార్ -2 సూపర్ వైజర్ మానస పేర్కొన్నారు. ఈ మేరకు ఐ.సి.డి.ఎస్ అర్బన్ -1 , సెక్టార్ -2 పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఫ్రీ స్కూల్ మెటీరియల్ ను కంచరపాలెం కూడలి జై ప్రకాష్ నగర్ వద్ద జరిగిందని, ఇప్పటికే ఫ్రీ స్కూల్ మెటీరియల్ తయారీకి సంబందించి సామగ్రి ని ఆయా అంగన్వాడీ కేంద్రాలకు సరపర చేశామన్నారు.

అదేవిధంగా ఫ్రీ స్కూల్ కు సంబందించి అంగ న్వాడీ కార్యకర్తలకు 6 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ను ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంక్యలో అంగన్వాడీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

## అభివృద్ధిని అడ్డుకోవద్దు : విద్యార్థులు



పాడేరు : విశాఖ ఏజెన్సీలో నిషేధ పీపుల్స్ సంస్థ (మావోయిస్టుల)కు వ్యతిరేకంగా సోమవారం పాడేరు మండలం కేంద్రంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టులు కార్య కలాపాలు మూలంగా అభివృద్ధి కుంటుపడుతుందని విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు ఆలపించారు. మావోయిస్టులు వద్దు అభివృద్ధి ముద్దు అంటూ స్థానిక సి హెచ్ స్కూల్ తలర సింగ్ పాఠశాల నుండి కాంప్లెక్స్ మీదుగా పాత బస్టాండు వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో పోలీసుల అనుచరులు అనే పేరుతో అమాయక గిరిజనులను చిత్రహింసలకు గురి చేస్తూ ప్రాణాలు తీస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో స్థానిక సి హెచ్ స్కూల్ పాఠశాలల విద్యార్థులు .శ్రీ కృష్ణ పురం, విద్యార్థినిలు,స్థానిక నెంబర్ వన్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# అమ్మఒడికి ని అందరికీ వర్తింపజేయాలని ధర్నా

## సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు రాస్తారోకో.. నిలిచిన ట్రాఫిక్.. పరిపాలన అధికారికి వినతి పత్రం





సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు రాస్తారోకో చేపట్టిన దృశ్యం

నర్సీపట్నం : అంగన్వాడీ కార్యకర్తలకు అమ్మఒడి పథకాన్ని కొనసాగించాలని అంగన్వాడీ అసోసియేషన్ (ఏ ఐ టి యు సి) ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో అంగన్వాడీలను భాగస్వామ్యం చేయాలని, వారికి వర్తింపజేయాలని ప్రధానమైన డిమాండ్ తో రాష్ట్ర అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్( ఏ ఐ టి యు సి) అనుబంధ సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అప్పలరాజు జిల్లా ఉపాధ్యక్షులు యన్. మణి, జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణవేణి జిల్లా కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి జిల్లా కార్యవర్గ సభ్యులు చీడిగుమ్మల సత్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతేడాది అమ్మ ఒడి ని ఇచ్చారని, ఈ ఏడాది కూడా కొనసాగించాలని కోరుతున్నామన్నారు.

# అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

## ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు



అచ్యుతాపురం : అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయడమే సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు (కన్న బాబురాజు) అన్నారు. సోమవారం మండలంలో పలు గ్రామాలలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణి చేశారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ యు సుకుమార్ వర్మ (తేజ), మండల వైసిపి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు

# దివీస్ ల్యాబ్ రేటరి సంస్థ పోషకాహారం అందజేత

భీమునిపట్నం : భీమిలిమండలం చిప్పాడ లో ఉన్న దివిస్ ల్యాబ్ రేటరి సంస్థ సామాజిక బాధ్యతా కార్యక్రమం లో బాగంగా మండలంలో నీ 16 జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సుమారు లక్ష తొబ్బై అరు వేలు విల్వువ గల పోషకాహారం అందజేశారు. ఈ సందర్భంగా దివిస్ జనరల్ మేనేజర్ వై.ఎస్. కోటేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థుల మానసిక శారీరక పెరుగుదలకు పోషకాహారం ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్ర్యమంలో దివిస్ ప్రతినిదులు పి మహేంద్ర, యు ఫనీద్ర, పైడి నాయుడు, పాటశాల ప్రధాన ఉపాద్యాయులు సూర్యనారాయణ, సి హెచ్ రజనీ,తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ వారియర్స్

# పాడేరు ఐటిడిఏ గేటు వద్ద వంటావార్పు....

పాడేరు : కోవిడ్ వారియర్ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక పాడేరు ఐటీడీఏ వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గౌరవ అధ్యక్షులు అమర్ పాల్గొని మాట్లాడుతూ ఈ కార్యక్రమం సమయంలో పాడేరు ఎమ్మెల్యే గారు ఐటీడీఏ లో మీటింగ్ కై వెళుతున్న సమయంలో గారిని అడ్డుకొని కోవీడ్ వారియర్స్ యొక్క సమస్యలను తెలియ పరచడం జరిగింది.ఎమ్మెల్యే గారికి 16 రోజుల కిందటే వినతిపత్రం విధించినప్పటికీ ఈ సమస్య పరిష్కారానికై ఒక్క అడుగు కూడా ముందుకు రాలేదని అన్నారు.కో విడ్ సమయంలో పాజిటివ్ రోగులకు వైద్య సేవలు అందించేందుకు స్టాఫ్ నర్స్ లను వీధుల్లోకి ఆగస్టు నెలలో తీసుకోవడం జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో వీరి చేత వైద్యసేవలు అందించుకొని నాలుగు నెలలు గడిచిన తర్వాత అర్థాంతరంగా వీరిని ఏఎంసీ ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు వీధుల్లో నుంచి తొలగించడం జరిగింది. వీరి యొక్క డిమాండ్స్ పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా శాంతియుతంగా వినతిపత్రం అందజేయడం రిలే నిరాహార దీక్షలు చేయడం ధర్నాలు నిర్వహించడం చేసినప్పటికీ ప్రజాప్రతినిధులు కానీ ప్రభుత్వ అధికారులు కానీ కనీసం చలనం లేనట్టు వ్యవహరించడం జరిగిందని అన్నారు. వీరి యొక్క డిమాండ్స్ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు చెల్లించాలని వెయిటేజ్,15 మార్కులు కలపాలని, నూతనంగా భర్తీ అయ్యే ఉద్యోగాల్లో వీరికే ప్రథమ స్థానం కల్పించాలని, విలేజ్ క్లినిక్లలో బిఎస్సి నర్సింగ్ వారితో పాటుగా, జిఎన్ఎం లను తీసుకోవాలని ఇతర జిల్లాల్లో మాదిరిగా క్వారంటైన్ సెంటర్స్ తీసేసి నప్పటికీ అక్కడ స్టాఫ్ నర్స్ లకు ఏ విధంగా ఇతర హాస్పిటల్స్లో పోస్టింగ్స్ కల్పించారో అలానే విశాఖ జిల్లాలో కూడా వీరికి విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లపై కొద్దిరోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన దానిలో భాగంగా నేడు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. కాబట్టి ప్రభుత్వం స్పందించే వరకు మా యొక్క డిమాండ్లను పరిష్కరించేంత వరకు మా యొక్క నిరసన కార్యక్రమాలు దఫ దఫాలుగా ఉదృతం చేస్తామని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు.కాబట్టి మరింత ఆందోళన కార్యక్రమాలు చేపట్టక ముందు సమస్యలు పరిష్కరించి డిమాండ్ ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జల్లి రాజబాబు, సిపిఐ పాడేరు మండల కార్యదర్శి కూడా రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులు రత్నం, ఏఐవైఎఫ్ పాడేరు మండల కార్యదర్శి కిముడు హనుమంత్, అప్పీ, కోవీడ్ వారియర్స్ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు పి. దుర్గా, సహాయ కార్యదర్శులు ఎస్. గిరిజ, ఎస్. శ్రీదేవి,రూప, ఉపాధ్యక్షులు ఏ. వెంకటలక్ష్మి టి.వెంకటలక్ష్మి,అరకు జిల్లా ఆసుపత్రి కమీటి అధ్యక్ష కార్యదర్శులు లకే శాంతి, చండ కవిత,సభ్యులు కృష్ణవేణి, బ్యులా,ఝాను,నగమల్లేశ్వరి, సలోమి,ప్రియ, వరమాలినీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.





# కోవాగ్జిన్ వ్యాక్సిన్ కు వలంటీర్లుగా ఉండడం ఆనందంగా ఉంది

## - శాసనసభ్యులు గద్దె రామమోహన్, గద్దె అనురాధ



గుంటూరు : ప్రపంచాన్ని వణికిస్తున్న కోవిడ్-19కు విరుగుడుగా భారత్ బయోటెక్ వారి కోవాగ్జిన్ వ్యాక్సిన్ కు తాము వలంటీర్లుగా ఉండడం చాలా ఆనందంగా ఉందని శాసనసభ్యులు గద్దె రామమోహన్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్ పర్సన్ గద్దె అనురాధ తెలిపారు.

సోమవారం ఉదయం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి యందు కోవాగ్జిన్ వ్యాక్సిన్ రెండవ డోసును గద్దె రామమోహన్, గద్దె అనురాధ తీసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైక్రోబయాలజీ చదువుకున్న తమకు బ్యాక్టీరియా, వైరస్, వ్యాక్సిన్ల గురించిన అవగాహన ఉందని, ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ కరోనా వల్ల ప్రజల్లో ఏర్పడిన భయాన్ని పోగొట్టేందుకు శాస్త్రజ్ఞులు చేస్తున్న ప్రయత్నాలకు తోడుగా తమ వంతుగా తాము ముందుకు వచ్చి కోవాగ్జిన్ వ్యాక్సిన్ కు వలంటీర్లుగా ఉండడం జరిగిందని, క్రిందటి నెలలో తాము మొదటి ఇంజక్షన్ చేయించుకోగా అనేకమంది స్పూర్తి పొంది వ్యాక్సిన్ చేయించుకునేందుకు ముందుకు వచ్చినట్లు ఇక్కడి డాక్టర్లు చెప్పారని, అదే తమకు సంతోషం కలిగించిందని తెలిపారు. ఈ విధంగా ప్రజల్లో ఒక రకమైన ధైర్యాన్ని, నమ్మకాన్ని కలిగించినట్లు గద్దె రామమోహన్, గద్దె అనురాధలు పేర్కొన్నారు. మొదట తాము తీసుకున్నపుడు గానీ, ప్రస్తుతం రెండవ డోసు తీసుకున్నపుడు గానీ తమకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదని, ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఈ వ్యాక్సిన్ ను తీసుకోవచ్చునని వారు ప్రజలకు సూచించారు.

హైదరాబాదులో ఆనాడు చంద్రబాబునాయుడు జీనోమ్ వ్యాలీని ఏర్పాటు చేసి అక్కడ ఇలాంటి వ్యాక్సీన్ల తయారీకి తగిన ఏర్పాట్లు కలిగించడం, అలాగే ఆయన ఏర్పాటు చేసిన మెడ్ టెక్ జోన్ లో కోవిడ్-19ను ఎదుర్కొనేందుకు అవసరమైన పరికరాలు తయారు కావడం చంద్రబాబు నాయుడు ముందుచూపునకు నిదర్శనమన్నారు.

కరోనా వైరస్ వ్యాక్సిన్ అతి తక్కువ కాలంలో తయారు చేసిన శాస్త్రవేత్తలకు, కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్ అయిన డాక్టర్లు, ప్యారా మెడికల్ సిబ్బంది, పోలీసు శాఖవారు, పారిశుద్ధ్య సిబ్బంది అందరికీ గద్దె రామమోహన్, అనురాధలు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తున్నాం

## నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ అన్నారు. సోమవారం గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం, జోగుంపేట, చీడిగుమ్మల గ్రామాలలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం కావాలని ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా లక్షలాది మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించిన ఘనత సీఎం జగన్‌కేదక్కిందన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ నిరంతరం సాగే ప్రక్రియ అన్నారు. పార్టీలకతీతంగా ఇళ్ల పట్టాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు, వైసిపి సీనియర్ నాయకులు చిటికెల భాస్కర్‌నాయుడు, మండల వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ లెక్కల సత్యనారాయణ, నాయకులు సుర్ల గిరిబాబు, చిటికెల వరహాలబాబు, జక్కు అప్పలనాయుడు, డిటి ఆనంద్, వైసిపినాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అమర్ ముఖచిత్రంతో పోస్టల్ స్టాంప్ విడుదల



అనకాపల్లి : నాయకుడి పై తమకున్న అభిమానాన్ని ఒకొక్కరు ఒకొక్క విధంగా చూపిస్తుంటారు. అనకాపల్లి వైఎస్ ఆర్‌సిపి పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వర రావు స్థానిక ఎమ్మెల్యే గుడివాడ అమర్ నాద్ ముఖచిత్రంతో పోస్టల్ స్టాంప్స్ వేయించి వినూత్న రీతిలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆళ్ల నాగేశ్వర రావు మాట్లాడుతూ... నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించే గుడివాడ నాయకత్వంలో పనిచేయటం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఈ నూతన సంవత్సరం లో భగవంతుడు ఆయనకు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని కలిగించాలని కోరుతున్నాను అని అన్నారు. ఈ పోస్టల్ స్టాంప్స్ ఆవిష్కరణలో గుడివాడ అమర్ నాద్ తో బాటు దాడి రత్నాకర్, దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జనకిరమరాజు, గొర్లి సూరిబాబు, జాజుల రమేష్, పీలా రాంబాబు, పలకా రవి, కోన ఉమ, ఉగ్గిన అప్పారావు, గంటా సముద్రాలు, మరియు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కృష్ణా జిల్లా, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే పార్థసారధి ఆహ్వానం మేరకు వెళ్లి "ఇళ్ల పట్టాభిషేకం" కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి.

# రాంకీ ఫౌండేషన్ నాబార్డు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు




మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు : రాంకీ ఫౌండేషన్, నాబార్డు వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపునను చింతలపూడి గ్రామంలో నిర్వహించారు. ఈ శిబిరంలో విశాఖపట్నం గాయత్రి మెడికల్ డ్టార్ కె.ఎన్.కిరణమూర్తి (డిప్యూటి మెడికల్ సూపరిండెంటెంట్) డాక్టర్ ని వి.జగన్నాధ్ రావు (జనరల్ సర్జన్) హాజరై 200 మంది ఆరోగ్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ కె.శ్రీకాంత్, హరికృష్ణ, మా తోట సిబ్బంది, గ్రామ ఆశ వర్కర్, చింతలపూడి అల్లూరి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కష్టానికి ఫలితం గా గుర్తింపు



దేవరాపల్లి : కష్టానికి ఫలితం గా గుర్తింపు లభిస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండలంలోని రైవాడ గ్రామంలో సోమవారం మండల టిడిపి కార్యకర్తల సమావేశం జరిగింది. మండల అధ్యక్షులు బండారు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందూ దేవుళ్ళ కే రక్షణ కల్పించలేని జగన్ సర్కార్ ప్రజలకేం రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయే పరిస్థితికి దిగజారి పోయిందన్నారు. ఓట్లు వేసిన పాపానికి సామాన్య ప్రజలు కుమిలిపోతున్నారని, ఈ పాలనలో అసహాయత, అసమానతలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల పేర్లు మార్చి కొనసాగిస్తున్నారని, కొత్తగా ప్రజలకు ఏమి చేసేది లేదన్నారు. అందరికీ ఇల్లు పట్టాలు పేరుతో ప్రజలను దగా చేస్తున్నారని విమర్శించారు. పేదలకు జారీ చేసిన పట్టాలలో ఏ అధికారి సంతకం లేకుండా ప్రజలను మభ్య పెట్టే విధంగా పని చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి పాలన ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం లేదని, కమిషన్ కోసం పనిచేస్తున్నాయని ఎద్దేవా చేశారు. సామాన్య ప్రజలపై ధరల భారాన్ని విపరీతంగా పెంచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకులు పూడి సింహాచలం నాయుడు, ఎరుకు నాయుడులకు సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మండల టిడిపి నూతన కార్యవర్గం ఎన్నికైంది. మండల టిడిపి అధ్యక్షులుగా చిటిమిరెడ్డి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చరఖాన సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పార్టీ నాయకులు రావాడ సింహాద్రి నాయుడు, పోతల పాత్రు నాయుడు, దొగ్గ అన్నం నాయుడు, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు గాలి వరలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా నానాజీ, కొప్పాక కాసుబాబు, గొల్లపల్లి అర్జునరావు, అల్లు అబద్ధం తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీల్లో స్పెషాలిటీ వైద్యసేవలు



అమరావతి: రాష్ట్రంలో ప్రజారోగ్య ముఖచిత్రం మారిపోనుంది. ప్రజలకు వైద్యం మరింత అందుబాటులోకి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యం మరింత చేరువ కానుంది. అర్ధరాత్రో అపరాత్రో పేషెంటు వెళితే ఎవరూ అందుబాటులో లేరన్న విమర్శలకు ఇక తావుండదు. పేద రోగులకు నూతన సంవత్సర కానుకగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఈనెల నుంచి 24 గంటలూ పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిపై రెండుమూడు రోజుల్లో ఉత్తర్వులు జారీచేయనున్నారు. ఔట్‌పేషెంటు సేవలు అందుబాటులో ఉంటాయి. ఆ తర్వాత ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో వస్తే డాక్టర్‌కు ఫోన్ చేస్తే పది నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకుంటారు. దీనికితోడు ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రాధాన్యం సంతరించుకోనుంది. ప్రతి రెండువేల కుటుంబాలకు ఒక వైద్యుడు బాధ్యుడుగా ఉంటారు. కేరళ, తమిళనాడు తరహాలో ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా బలోపేతం చేసే దిశగా చర్యలు పూర్తయ్యాయి.

**ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు**

రాష్ట్రంలో ప్రస్తుతం 1,145 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రతి పీహెచ్‌సీలోను ఇద్దరు వైద్యులు ఉండేలా నియామకాలు పూర్తయ్యాయి. వైద్యసేవలతో పాటు రక్తపరీక్షలు కూడా అక్కడే చేసి వైద్యం చేస్తారు. రాత్రిపూట వైద్యానికి వస్తే డాక్టర్‌కు ఫోన్ చేస్తే వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఫార్మసిస్ట్, ల్యాబ్‌టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉంటారు. ప్రాథమిక వైద్యానికి సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతారు.

మధ్యాహ్నం 2 గంటల నుంచి షుగరు, బీపీకి

ఇకమీదట ఆదివారం మినహా మిగిలిన ఆరురోజులు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అసాంక్రమిక వ్యాధులకు ఔట్‌పేషెంటు సేవలు అందుబాటులో ఉంటాయి. మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వ్యాధులకు ఈ క్లినిక్‌లు పనిచేస్తాయి. వ్యాధి తీవ్రతను బట్టి రిఫరల్ విధానం అంటే పెద్దాస్పత్రులకు పంపించే ఏర్పాట్లు జరుగుతాయి. ఈ వ్యాధులకు మందులన్నీ రోగులకు ఉచితంగా ఇస్తారు.

ఆరురోజులు స్పెషలిస్టుల సేవలు

ఇప్పటివరకు పీహెచ్‌సీల్లో ప్రాథమిక వైద్యమే (ఎంబీబీఎస్ డాక్టరు చేసే వైద్యమే) లభించేది. ఇకమీదట ఆరురకాల స్పెషాలిటీ వైద్యసేవలు అందించనున్నారు. ఈఎన్‌టీ, డెంటల్, కంటిజబ్బులు, మెంటల్ హెల్త్, గేరియాట్రిక్, గైనకాలజీ సేవలు అందిస్తారు. ఒక్కో స్పెషాలిటీకి ఒక్కోరోజు చొప్పున ఆరురోజులు ఆరుగురు స్పెషలిస్టు డాక్టర్లు ఔట్‌పేషెంటు సేవలు అందిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి ఈ డాక్టరే పెద్దాస్పత్రికి రిఫర్ చేస్తారు. ప్రతి స్పెషలిస్టు డాక్టరు ఉదయం, మధ్యాహ్నం వేర్వేరు పీహెచ్‌సీల వంతున వారంలో 12 పీహెచ్‌సీల్లో వైద్యసేవలు అందించాలి.

నిరంతరం అందుబాటులో ఫ్యామిలీ డాక్టరు

పీహెచ్‌సీలో వైద్యుడికి రెండువేల కుటుంబాల ఆరోగ్య బాధ్యతలు అప్పగించారు. ఆ రెండువేల కుటుంబాలకు అతడు ఫ్యామిలీ డాక్టరుగా ఉంటారు. వారికి ఆరోగ్యపరంగా ఎప్పుడు అవసరమైనా ఆ వైద్యుడు సంబంధిత సమాచారాన్ని విశ్లేషించి తగిన చికిత్స అందిస్తారు. అవసరమైతే పెద్దాస్పత్రికి రిఫర్ చేస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం

పీహెచ్‌సీలన్నిటినీ 24 గంటలు పనిచేసేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. స్పెషలిస్టు డాక్టర్లను కూడా ఏర్పాటు చేశాం. అన్ని పీహెచ్‌సీల్లో డబుల్ డాక్టర్ ఉంటారు. డాక్టరు లేడు, మందులు లేవు అన్న మాట వినిపించదు.

# ముంబై ఉగ్రదాడి సూత్రధారి లఖ్వీ అరెస్టు



న్యూఢిల్లీ : ముంబై దాడుల సూత్రధారి, లష్కరే తోయిబా ఆపరేషన్స్ కమాండర్ జకీ ఉర్ రెహ్మాన్ లఖ్వీ (61) ని అరెస్ట్ చేశామంటూ శనివారం పాక్ పోలీసులు సంచలన ప్రకటన చేశారు. 2008లో ముంబై ఉగ్ర దాడుల మాస్టర్ మైండ్ లఖ్వీని తమ కౌంటర్ టెర్రరిజం విభాగం (సీటీడీ) అరెస్టు చేసింది పాక్ ప్రకటించింది. అయితే ఆయన అరెస్టు చేసిన స్థలాన్ని అధికారులు ప్రస్తావించలేదు.

ముంబై దాడుల మైస్టర్ మైండ్ లఖ్వీని అదుపులోకి తీసుకున్నామని పాక్ పోలీసు అధికారులు ప్రకటించారు. ఉగ్రవాద సంస్థలకు నిధులను సమకూరుస్తున్నాడన్న ప్రధాన కారణంతోఅతడిని అరెస్ట్ చేసినట్టు సీటీడీ తెలిపింది. లఖ్వీ ఒక డిస్పెన్సరీని నడుపుతూ, ఉగ్రవాద చర్యలకు, ఆ నిధులను ఉపయోగిస్తున్నాడని ఆరోపించారు. ఈనిధులను ఉగ్రవాద ఫైనాన్సింగ్‌తో పాటు వ్యక్తిగత ఖర్చులకు కూడా ఉపయోగించాడని పేర్కొంది. ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల విషయమై లాహోర్‌లో నమోదైన కేసు ఆధారంగా స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి, ఆ సంస్థకు ఆర్థికంగా సాయం చేస్తున్న లఖ్వీని పట్టుకున్నామని పాక్ పోలీసులు వెల్లడించారు. అయితే లఖ్వీని ఎప్పుడు, ఎలా అరెస్ట్ చేశారన్న వివరాలను మాత్రం పాక్ వెల్లడించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కాగా ముంబై దాడుల కేసుల్లో లఖ్వీయే ప్రధాన సూత్రధారి. 2008 నవంబర్ 26 నుంచి నవంబర్ 29 వరకు ముంబైలోని ఎనిమిది ప్రాంతాల్లో వరుస బాంబు దాడులు చేసిన ఘటనలో ఏకంగా 173 మంది ప్రాణాలు కోల్పోయారు.

308 మంది తీవ్రంగా గాయపడ్డారు. ముంబై ఉగ్రదాడి కేసులో అరెస్టయిన లఖ్వీ 2015 నుంచి బెయిల్‌పై ఉన్నాడు.

## రాష్ట్రంలో దేవాలయాలపై జరుగుతున్న దాడులు వెనుక

# చంద్రబాబునాయుడు హస్తం ఉంది

### - టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



తిరుమల : రాష్ట్రంలో దేవాలయాలపై జరుగుతున్న దాడులు వెనుక ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు హస్తం ఉందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. రాష్ట్రం లో జరుగుతున్నటు వంటి దేవాలయాలపై దాడులను వైవీ సుబ్బారెడ్డి ఖండించారు. ఈ విషయమై సోమవారం మీడియా సమావేశం ఎర్పాటు చేశారు. ఈ సందర్బంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతు ఎక్కడ దాడులు జరుగుతున్న చంద్రబాబునాయుడు అండ్ కో బృందానికి ముందుగా తెలుస్తున్నాయి.

రాష్టంలో దేవాలయలలో జరిగిన ఘటనలు పై పూర్తి స్థాయి విచారణ జరుగుతుంది.సీఎం జగన్ మోహనరెడ్డి ఇప్పటికే పోలీస్ శాఖకు, ఇతర అధికారులకు ఆదేశాలు జరిచేసారు.

ప్రభుత్వం ఎప్పుడు మంచి పనులు చేస్తుందో అప్పుడే రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

కేవలం ప్రభుత్వ ఇస్తున్న సంక్షేమ పదకాలు ప్రజలలోకి వెళ్లకుండా ఉండేందుకు ఇటువంటి దాడులకు చంద్రబాబు వడిగడుతున్నాడు.

తిరుపతి ఉప ఎన్నకల్లో వైసీపీ భారీ విజయం సొంతం చేసుకోబోతుందని వైవీ సుబ్బారెడ్డి తెలియజేసారు.



నరసన్న పేట మండలంలోని గుండువిల్లి పేటలో జరుగుతున్న సిసింద్రీ మెమోరియల్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలను ప్రారంభించిన డెప్యూటీ సీఎం, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్. ఫైనల్ కు చేరుకున్న విశాఖపట్నం, ఉణుకూరు జట్లను పరిచయం చేసుకొని సోదరుడు ధర్మాన రాందాస్ తో కలసి అభినందనలు తెలియజేసిన కృష్ణదాస్.

## జివియంసి కమిషనర్ ఇ-స్పందన నిర్వహణ

విశాఖపట్నం : పట్టణ పరిధిలో కరోనా వైరస్ వ్యాప్తి చెందు తుండడం వలన ప్రజల వద్ద నుండి విన్నపములు నేరుగా స్వీకరించేందుకు అవకాశము ఉండుటలేదు. కావున, దీన్ని దృష్టిలో పెట్టుకొని అంతర్జాల సహాయముతో ఫేస్ బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల వద్ద నుండి విన్నపములు సోమవారం ఇ-స్పందన కార్యక్రమంలో జి.వి.ఎం.సి.. కమిషనర్ డా. జి. సృజన స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులపై వివరణ ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో పట్టణ పరిధిలో పలు ప్రాంతాల నుండి మొత్తము 09 ఫిర్యాదులు రాగా, దీనిలో ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్ విభాగానికి- 02, ఇంజినీరింగ్ పబ్లిక్ వర్క్స్ విభాగానికి -05, ఇంజినీరింగ్ భూగర్భ మురుగునీటి విభాగానికి- 01, యు.సి.డి. విభాగానికి-01 చెందినవి. తదుపరి, ఈ ఫిర్యాదులను పరిశీలించిన కమిషనర్ వీటిపై తగుచర్యలు తీసుకునే నిమిత్తం సంబందిత అధికారులకు పంపారు. అనంతరం, కమిషనర్ వీడియో కన్ఫెరెన్సు ద్వారా జోనల్ కమిషనర్లు, ఇతర జోనల్ స్థాయి అధికార్లుతో మాట్లాడుతూ, స్పందన ద్వారా, ఇ.ఆర్.పి. విధానం, డయల్ యువర్ కమిషనర్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు, సచివాలయాల ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కోరారు. మరీ ముఖ్యంగా వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లతో మాట్లాడుతూ, ఇటీవల జివిఎంసి పరిధిలో మంజూరైన టిడ్కో ఇళ్ళు, ఇండ్ల స్థలాలు, బి.ఎల్.సి. పట్టాల పంపిణీ పూర్తి స్థాయిలో లబ్దిదార్లకు, వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శులు, వాలంటీర్లు ద్వారా పంపిణీ చేసి దాని చేరిన రసీదు(అక్నాలడ్జ్మెంట్)లను త్వరితగతిన సమర్పించాలని అందరు జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

## మురికివాడ ప్రాంతవాసులు స్వీయ పరిశుభ్రత పాటించాలి

56వ వార్డులో కళా హాస్పిటల్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం

ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ

అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి



కంచరపాలెం : మురికివాడల్లో నివసిస్తున్న కాలనీవాసులు మారుతున్న కాలానుగుణంగా ఆయా ఇంటి పరిసరాల్లో స్వీయ పరిశుభ్రత పాటించాలని కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి పేర్కొన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 56 వ వార్డు చాకలి గడ్డ, రాజీవ్ కాలనీ కూడలిలో 56 వ వార్డు సిపిఎం కార్పొరేటర్ అభ్యర్థి బొట్ట ఈశ్వరమ్మ పిలుపు మేరకు కళా హాస్పిటల్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

బుచ్చి మాంబ కాలనీ, దయానంద్ నగర్, పైడిమాంబ కాలనీ తదితర కాలనీవాసులు సుమారు 500 మంది ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. వీరందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరంలో డాక్టర్ జి ప్రసాద్ రెడ్డి, డాక్టర్ దీపిక, డాక్టర్ ప్రావీణ్య మరియు కళా హాస్పిటల్ వైద్య సిబ్బంది తో పాటు, ఆంధ్ర ప్రదేశ్ కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్ర భారత్, అంబేద్కర్ కాలనీ వాసులు మల్లేష్, బాబురావు, వెంకటరావు, కె. రమేష్,సీపీఎం పార్టీకి చెందిన ఎన్. సింహాచలం, కే రాంబాబు, ఎం ఈశ్వర్ మరియు అధిక సంఖ్యలో స్థానిక మహిళలు రావు, వై సత్య, పాల్గొన్నారు.





విశాఖపట్నం నగర పార్టీ కార్యాలయంలో నగర పార్టీ అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థి విభాగం అధ్యక్షులుగా పూడి సాయిచరణ్ కు నియామకం పత్రం అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ విద్యార్థులు లో ఉత్సాహం నింపి పార్టీ బలోపేతం చేయుటకు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఎంపీ విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి పార్టీ లో గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు తిప్పల వంశీరెడ్డి, బి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1 నుంచి రేషన్ డోర్ డెలివరీ : సీఎం జగన్



తాడేపల్లి: ధాన్యం సేకరణ, రేషన్ డోర్ డెలివరీపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాలశాఖ మంత్రి కొడాలి నాని, సీఎస్ ఆదిత్యనాథ్ దాస్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, పౌర సరఫరాల కమిషనర్ కోన శశిధర్‌తో పాటు, ఆ శాఖకు చెందిన పలువురు సీనియర్ అధికారులు హాజరయ్యారు ధాన్యం సేకరించిన తర్వాత గతంలో చెప్పినట్లుగా 15 రోజుల్లోగా పేమెంట్లు జరిగేలా చూడాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యానికి సంబంధించి ఈ సంక్రాంతి కల్లా రైతుల బకాయిలు పూర్తిగా చెల్లించాలన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించిన బిల్లులు పెండింగులో పెట్టకూడదని, ఈ ఖరీఫ్‌కు సంబంధించి నిర్ణీత లక్ష్యం ప్రకారం ధాన్యం సేకరణ జరపాలని సీఎం సూచించారు.

**ఈ నెల 3వ వారంలో డోర్ డెలివరీ వాహనాలు:**

ఇంటి వద్దనే నిత్యావసర సరుకుల పంపిణీ కోసం సిద్ధం చేసిన ప్రత్యేక వాహనాలు ఈ నెల 3వ వారంలో ప్రారంభించడానికి సీఎం నిర్ణయించారు.

- అదే రోజున 10 కిలోల రైస్ బ్యాగ్స్ ఆవిష్కరణ

- వచ్చే నెల (ఫిబ్రవరి) 1వ తేదీ నుంచి ఇంటి వద్దనే నిత్యావసర సరుకుల పంపిణీ. - ఇందు కోసం 9260 మొబైల్ యూనిట్లు. అదే సంఖ్యలో అధునాతన తూకం యంత్రాలు.

- 2.19 కోట్ల నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులు రెడీ.

-ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలకు నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాలు.

-లక్ష్యానికి మించి ఎస్సీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు వాహనాలు కేటాయింపు.

- ఎస్సీలకు 2333, ఎస్టీలకు 700, బీసీలకు 3875, ఈబీసీలకు 1616, ముస్లిం మైనారిటీలకు 567, క్రిస్టియన్ మైనారిటీలకు 85 వాహనాలు.

- వాహనాల లబ్ధిదారులకు 30 శాతం సబ్సిడీ, 60 శాతం బ్యాంకు రుణం, 10 శాతం లబ్ధిదారుడి వాటా.

- సంక్షేమ కార్యక్రమంలో భాగంగా, ఆయా కార్పొరేషన్ల ద్వారా వారికి రుణాలు.

## ఇళ్ల పట్టాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్.కె.రోజా



నగరి : ఆర్.కే.రోజా సోమవారం విజయపురం మండలం లోని పన్నూరు నందు దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన నవరత్నాలు పథకం భాగంగా వైఎస్ఆర్ జగనన్న కాలనీలలో233 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

పన్నూరు 172, జగన్నాధపురం 13,కళి యంబాకం 70,మాదవరం 53,ఆలపాకం 120,మొత్తం 442 మందికి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపి.డి.ఓ అరుణ, ఎమ్మార్వో కోటిరెడ్డి, హౌసింగ్ డి.ఇ. శంకరప్ప, ఎం.ఇ.ఓ ఆంజనేయులు, లక్ష్మీపతి రాజు, రామకృష్ణంరాజు, రాజగోపాల్, ఆనందం, హరి నాయుడు, గుణశేఖర్ రెడ్డి, శోభ రామకృష్ణ మరియు విజయపురం మండలం వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించిన కమిషనర్ డాక్టరు జి.సృజన



విశాఖపట్నం : జి.వి.ఎం.సి. ప్రధాన కార్యాలయం సమావేశపు మందిరం నుండి డయల్ యువర్ కమిషనర్ ప్రోగ్రామును కమిషనర్ డా. జి. సృజన టోల్ ఫ్రీ నం.1800-4250-0009 ద్వారా ఉదయం 10.00 గం. నుండి నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు. స్వీకరించిన విజ్ఞప్తులను స్వయంగా పరిష్కరించి తగు నివేదిక వెంటనే సమర్పించు నిమిత్తం ఆయా విభాగాల అధికారులను/జోనల్ కమిషనర్లకు పంపించారు. ఇందులో ఒకటవ జోనుకు 04, రెండవ జోనుకు 06, మూడవ జోనుకు 03, నాల్గవ జోనుకు 02, అయిదవ జోనుకు 06, ఆరవ జోనుకు 05, ఇతరులు 01, మొత్తము 27 ఫిర్యాదులు ఫోను ద్వారా స్వీకరించారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన కమీషనర్ డా. జి. సృజన ప్రధాన కార్యాలయ విభాగపు ఉన్నతాధికారులతోను, జోనల్ కమిషనర్లతోను మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులు 03 రోజులలో పరిష్కరించేందుకుగాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు రమణి, సన్యాసిరావు, సి.సి.పి.విద్యుల్లత, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వై. మంగపతిరావు, సి.ఎం.ఓ.హెచ్. డా. కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, జె.డి.(అమృత్) విజయ భారతి, డి.సి.(ఆర్) ఎ. రమేష్ కుమార్, ఎఫ్.ఎ ఏ.ఒ. మల్లికాంబ, డి.పి.ఓ. చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ సంస్థలకు ఏమాత్రం తీసిపోం

హైదరాబాద్: భారత్ బయోటెక్ రూపొందించిన కొవాగ్జిన్ విషయంలో పలువురు రాజకీయ నాయకులు విమర్శలు చేయడాన్ని ఆ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ఎల్ల తప్పుబట్టారు. తమ డేటాలో పారదర్శకత లేదన్నది పూర్తిగా అవాస్తవమని చెప్పారు. వ్యాక్సిన్ల అభివృద్ధిలో తమకు సుదీర్ఘ అనుభవం ఉందని, ప్రపంచవ్యాప్తంగా ఏళ్లుగా సేవలందిస్తున్నామని తెలిపారు. కొవాగ్జిన్‌కు డీసీజీఐ అత్యవసర అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు, వాలంటీర్లకు, కొవిడ్ టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విదేశీ సంస్థలకు ఏమాత్రం తాము తీసిపోబోమని స్పష్టం చేశారు.



“చాలా మంది మా సమాచారం పారదర్శకంగా లేదని అంటున్నారు. వ్యాక్సిన్ల విషయంలో ప్రపంచ ప్రఖ్యాత జర్నల్స్‌లో భారత్ బయోటెక్ గురించి వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఇప్పటి వరకు 16 వ్యాక్సిన్లు తయారు చేశాం. 123 దేశాలకు మేం సేవలందిస్తున్నాం. కరోనా విషయంలో కేవలం దేశంలోనే కాదు యూకే సహా 12 దేశాల్లో క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాం. తమిళనాడులోని రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు” అని కృష్ణ అన్నారు.

“వ్యాక్సిన్ల విషయంలో మాకు గ్లోబల్ లీడర్‌షిప్ ఉంది. వివిధ దేశాల్లో మాకు భాగస్వాములు ఉన్నారు. మా వ్యాక్సిన్‌కు సంబంధించిన అన్ని వివరాలను పుణె ఎన్ఐవీ, ఐసీఎంఆర్‌తో పంచుకున్నాం. బీఎస్ఎల్-3లో టీకాలు ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా ఈ తరహా ఉత్పత్తి సదుపాయం లేదు. కేవలం మాకు మాత్రమే అది సొంతం. కొందరు పబ్లిక్ డొమైన్‌లో వివరాలు ఎందుకు పెట్టలేదని అంటున్నారు. భారత్ బయోటెక్ గురించి ఐదు పబ్లికేషన్లు వచ్చాయి. ఫైజర్, ఆస్ట్రాజెనెకా, మొడెర్నా వంటి సంస్థలతో పోటీగా మా వ్యాక్సిన్ గురించి పబ్లికేషన్లు వచ్చాయి. కొన్ని దేశీయ కంపెనీలకు సంబంధించి ఎలాంటి పబ్లికేషన్లు రాలేదు” అని గుర్తు చేశారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com